

ఆంధ్రజ్యోతి



ఊరంతా.. సంక్రాంతి

- నేడు భోగి మంటలకు సిద్ధం
- పట్టణాలు ఖాళీ.. పల్లెలు కళకళ
- అంబరాన్ని అంటేలా సంక్రాంతి సంబరాలు
- రాజధానిలో నేడు భోగి వేడుకలకు చంద్రబాబు, పవన్

గుంటూరు సిటీ, జనవరి 13: సూర్యుడు మకర రాశిలో ప్రవేశించే శుభ వేళ జరుపుకునే పెద్ద పండుగ సంక్రాంతి. లోగిళ్లు కొత్త పంటలతో కళకళలాడుతుండగా.. పిండి వంటల సువాసనలు.. హరిదాసు కీర్తనలు.. గంగిరెద్దుల సందడి.. గొబ్బెమ్మలతో రంగుల ముగ్గుల అలంకారం.. ఇదంతా సంక్రాంతి వైభవం. చిన్నా.. పెద్ద.. కలిసి చేసుకునే సంబరం. మనసులను.. మనుషులను కలిపే పండుగ వైభోగం. పల్లె ముంగిట్లో మాత్రమే కనిపించే సందడి. ఇలా ఈ పండుగ గురించి ఎన్ని చెప్పినా.. చె ప్పుకు న్నా త క్కు వే .

ఈ ఏడాది సంక్రాంతి మరింత ముస్తాబుగా కనిపిస్తుంది. తెలుగువారి పెద్ద పండుగ కోటి ఆశల పందిరిగా అనిపిస్తుంది. కోడి పందాలు.. మందు.. విందులతో భోగీ రోజున అంబరాన్ని అంటే సంబరాలకు పల్లెల్లో ప్రత్యేకంగా ఏర్పాట్లు జరిగాయి. ఆదివారం తెల్లవారుజామున భోగి మంటలకు చిన్నాపెద్ద తారతమ్యం లేకుండా శనివారం రాత్రి నుంచి ప్రత్యేక ఏర్పాట్లు చేసుకున్నారు. ఇంటి దగ్గర పండుగ సందడికి పట్టణాలు, నగర ప్రాంతాల నుంచి కుటుంబాలకు కుటుంబాలు పల్లెకు తరలి వచ్చాయి. దీంతో పలు పట్టణ ప్రాంతాలు వెలవెలపోతుండగా.. పండుగకు వచ్చిన వారితో పల్లెలు కళకళలాడుతున్నాయి. హైదరాబాద్, బెంగళూరు తదితర నగరాలతో పాటు ఇతర దేశాల్లో స్థిరపడిన వారందరూ పల్లెకు తరలిచ్చారు. వివిధ నగరాలు, ఇతర దేశాల నుంచి ఎన్నారైలు పెద్ద సంఖ్యలో పల్లె గడప తొక్కడంతో పల్లెల్లో ఆనందోత్సాహాలు వెల్లివిరిస్తున్నాయి. ఇక వారి బంధువులు, తల్లిదండ్రుల్లో అయితే సంతోషం చెప్పనలివి కాకుండా ఉంది. హైదరాబాద్ నుంచి పెద్దసంఖ్యలో పలువురు ఒకేసారి వాహనాలతో బయలుదేరడంతో అద్దంకి-నార్కెట్ పల్లి రాష్ట్ర రహదారి వాహనాల రద్దీతో కిక్కిరిసిపోయింది. తుమ్మల చెరువు, మంగళగిరి సమీపంలోని టోల్ గేట్ల వద్ద వాహనాలు కిలోమీటర్ల మేర నిలిచిపోయాయి.

రాజధాని రైతు కళ్లలో కొత్త ఆనందం

ఈ ఏడాది సంక్రాంతి వేళ రాజధాని రైతుల కళ్లలో కొత్త ఆనందం కనిపిస్తోంది. నాలుగున్నరేళ్లుగా ప్రభుత్వ నిరంకుశ విధానాలతో గాయపడిన రైతుల గుండెల్లో తాజా రాజకీయ పరిణామాలతో కొత్త సంతోషం కనిపిస్తోంది. భోగి మంటల్లో గత చేదు జ్ఞాపకాలను, ప్రభుత్వ అరాచక జీవోలను తగల బెట్టేందుకు రాజధాని ప్రాంతవాసులు సిద్ధమయ్యారు. ప్రభుత్వం మారుతుందన్న సర్వేలు, విశ్లేషణలతో గత కొంత కాలంగా రియల్ ఎస్టేట్ రంగానికి ఈ ప్రాంతంలో ఊపు వచ్చింది. ఇది కూడా రాజధానిలో సంక్రాంతి సందడిని ఎక్కువ చేస్తోంది. ఇక భోగి పండుగను మరింత సంబరంగా జరుపుకునేలా రైతులు, గ్రామీణులు ఏర్పాట్లు చేసుకుంటున్నారు. తుళ్లూరు మండలం మందడం గ్రామం గోల్డెన్ రూల్ ఆవరణలో జరిగే భోగీ వేడుకలకు చంద్రబాబు, పవన్‌కల్యాణ్ హాజరు కానున్నారు. ఈ పరిణామం రైతు కళ్లలో కొత్త కాంతు లకు కారణమైంది. వేడుకల ఏర్పాట్లను తాడికొండ టీడీపీ ఇన్‌చార్జ్ తెనాలి శ్రావణ్‌కుమార్ శనివారం పరిశీలించారు.







హైదరాబాద్ నుంచి పిడుగురాళ్ల మీదగా పల్లెలకు వెళుతున్న కార్లు

తీరంలో.. కోఢీ

- బరులకు భారీగా ఏర్పాట్లు
- నేటి నుంచి జోరుగా పందాలు
- కోత ముక్కలాటకు ప్రత్యేక టెంట్లు
- రూ.10 వేల నుంచి 2 లక్షల పందాలకు బరులు
- సమీప జిల్లాలు, తెలంగాణ నుంచి తరలిరానున్న జనం



రేపల్లె, భట్టిప్రోలు, చుండూరు, జనవరి 13: సంక్రాంతి వచ్చేసింది.. సంబరాలు అంబరాన్ని అంటేలా వేడుకలు చేసుకునేందుకు పల్లె జనం సిద్ధమయ్యారు. భోగితో సంక్రాంతి సంబరాలు ప్రారంభమవనుండగా.. కోడి పందాలకు కోళ్లు సై అంటూ కాలు దువ్వేందుకు సిద్ధమయ్యాయి. పందాల సందడికి జూదరులు సిద్ధమవగా.. వాటిని చూడాలని ఉత్సుకతతో పలువురు తరలిరానున్నారు. అధికారులు అడ్డుకుంటున్నా తీర ప్రాంతంలో తగ్గేదేలేదన్నట్లుగా కోడిపందాలకు ఏర్పాట్లు జరుగుతున్నాయి. సంక్రాంతి సంప్రదాయలను అడ్డంపెట్టుకుని కోడిపందాలకు బరులను నిర్వాహకులు సిద్ధం చేస్తున్నారు. తీర ప్రాంతంలోని రేపల్లె, వేమూరు నియోజకవర్గాలలో అధికార పార్టీ పెద్దల ఆధ్వర్యంలో భారీ బరులను ఏర్పాటు చేశారు.



లక్ష నుండి రూ.5 లక్షలు కోడిపందాలు వేసేందుకు సిద్ధం చేస్తున్న బరి

కోడిపందాలతో పాటు పేకాట, లోనబయట, కోతముక్క, గుండాటలకు బరుల వద్ద నిర్వాహకులు ఒక్కొక్కరు నుంచి రూ.లక్షల్లో వసూలు చేశారు. కోడిపందాల జూదరులతో పాటు వాటిని చూసేందుకు జిల్లాలోని వివిధ ప్రాంతాలతో పాటు గుంటూరు, కృష్ణా, పల్నాడు, ప్రకాశం జిల్లాలతో పాటు తెలంగాణ ప్రాంతం నుంచి వేలాదిగా తరలివచ్చే అవకాశాలు ఉన్నాయి. ఎస్పీ వకుల్‌జిందాల్ ఆదేశాలకు విరుద్ధంగా రేపల్లె, వేమూరు నియోజకవర్గాల్లో అధికార పార్టీ నాయకులు బరులను ఏర్పాటు చేస్తున్నారు. రేపల్లె, నిజాంపట్నం, భట్టిప్రోలు మండలం ఓలేరు సమీపంలో 216 జాతీయ రహదారి పక్కన బరులను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా బరుల వద్ద వాహనాల పార్కింగ్ ప్రదేశాల్ని రూ.లక్షలకు మండల స్థాయి నాయకులకు అప్పగించారు. బరుల వద్ద మద్యం అమ్ముకునేందుకు పాటలు నిర్వహించారు. బిర్యానీ పాయింట్‌కు రూ.5 లక్షలకుపైగానే, శీతల పానీయాలు, గుట్కాలు, ఖైనీలు సిగరెట్లు అమ్మేవారి నుంచి రూ.2 లక్షలు వసూలు చేశారు. కేటగిరీల వారీగా రూ.10 వేలు, రూ.20 వేలు, రూ.50 వేలు, రూ.లక్ష, రూ.2 లక్షల బరులను ఏర్పాటు చేశారు. సోమవారం నుంచి కోడిపందాలు నిర్వహిస్తామని నిర్వాహకులు ఇప్పటికే ప్రకటించారు. కోడిపందాలు వేసేందుకు గుంటూరు, బాపట్ల, ప్రకాశం, కృష్ణా, తెలంగాణ నుంచి వచ్చిన వారితో రేపల్లెలోని లాడ్జీలు నిండిపోయాయి.

పోలీసుల ఆదేశాలు బేఖాతారు

రెండు రోజులుగా తీరప్రాంతంలో కోడిపందాలను కట్టడి చేసేందుకు పోలీసులు ప్రయత్నిస్తున్నారు. అధికార పార్టీ నాయకుల అండదండలు ఉండటంతో నిర్వాహకులు పోలీసుల సమక్షంలోనే బరులను ఏర్పాటు చేస్తున్నారు. ఆయా బరుల వద్ద పోలీసులు కాపలా కాసినా ఫలితంలేకుండా పోయింది. రాజకీయా నాయకుల ఒత్తిళ్లతో పోలీసులు శనివారం వెనుతిరిగి వెళ్లిపోయారని సమాచారం. నిజాంపట్నంలో పది బరులను ఏర్పాటు చేస్తున్నారు. భట్టిప్రోలు మండలం ఓలేరు సమీపంలో కోడి పందాలకు భూమిని చదును చేశారు. మూడు రోజుల పాటు పందాలు నిర్వహిస్తామని ఇప్పటికే ప్రకటించారు. బరుల ఏర్పాటుకు తీసుకువచ్చిన సామగ్రిని పోలీసులు పంపించి బందోబస్తు ఉన్నారు. చుండూరులో నాలుగు రోజుల క్రితం అధికార పార్టీ పెద్దలతో నియోజకవర్గ నాయకుడు జరిపిన సంప్రదింపులు సఫలం అయ్యాయి. దీంతో స్థానిక నాయకులు చుండూరు, వేటపాలెం మధ్య పొలాల్లో బరులు సిద్ధం చేస్తున్నారు. గత ఏడాది రూ.కోటికిపైగా ఆదాయం రావడంతో ఈ ఏడాది కూడా నిర్వాహకులు కోడిపందాలకు పోటీపడుతున్నట్లు సమాచారం. ఈ ఏడాది కూడా అదే స్థలంలో పందాల కోసం రెండు ఎకరాల్లో ఏర్పాట్లు చేస్తున్నారు. ఇప్పటికే పోల్స్ వేసి బరులకు సిద్ధం చేశారు. ఆయా ఏర్పాట్లు వెనుక వైసీపీ పెద్దలు ఉండటంతో స్థానిక పోలీసులు వారిని అడ్డుకోలేకపోతున్నారని సమాచారం.

కోడి పందాల బరి ఏర్పాట్లను అడ్డుకున్న కొల్లూరు తహసీల్దార్, ఎస్ఐలు



ఏర్పాట్లను అడ్డుకున్న అధికారులు

కొల్లూరు: మండలంలోని పెసర్లంక పొలాల్లో బరి కోసం జరుగుతున్న ఏర్పాట్లను శనివారం ఎస్ఐ రాజ్యలక్ష్మి, తహసీల్దార్ శ్రీనివాసరావులు అడ్డుకున్నారు. సంప్రదాయబద్ధంగా కోడి పందాలు వేసుకుంటామని, పైగా తమ పొలంలో బరి ఏర్పాటు చేసుకుంటే ఏమైందని నిర్వాహకులు అధికారులను ప్రశ్నించారు. కోడి పందాలకు ఎటువంటి అనుమతులు లేవని నిర్వాహకులకు ఎస్ఐ, తహసీల్దార్ తేల్చిచెప్పారు.



నిజాంపట్నంలో కోడిపందాలు నిర్వహించేందుకు బరులను ఏర్పాటు చేస్తున్న నిర్వాహకులు

జగన్‌కు.. ఝలక్

- మొన్న రాయుడు.. నేడు బాలశౌరి
- ఇప్పటికే దూరమైన శ్రీకృష్ణదేవరాయులు ?
- ఎంపీలకు సీఎం రేవంత్ విందు తెచ్చిన తంటా
- కక్షతోనే సీట్లు మార్పిడి వంకతో లావు, బాలశౌరిలకు పొగ



గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): ముఖ్యమంత్రి జగన్ తన సంకుచిత మనస్తత్వంతో ఉమ్మడి గుంటూరు జిల్లాకు చెందిన ఇద్దరు ఎంపీలు చేజేతులా పార్టీ వీడే పరిస్థితి తెచ్చుకున్నారు. మరొక ఔత్సాహిక ఎంపీ కూడా ఇప్పటికే పార్టీని వీడారు. కొండ నాలుకకు మందేస్తే ఉన్న నాలుక ఊడిందన్న చందాన మచిలీపట్నం ఆఫర్ అందుకున్న రాయుడే కాకుండా, తనను ఉట్టి పుణ్యానికే పక్కన పెట్టే ప్రయత్నం చేస్తున్నారని భావించిన సిట్టింగ్ ఎంపీ బాలశౌరి కూడా వైసీపీకి రాజీనామా చేసి జగన్‌కు ఝలక్ ఇచ్చారు. ఇక ఇప్పటికే జగన్ నిర్ణయంపై మండిపడుతూ నరసరావుపేట ఎంపీ లావు శ్రీకృష్ణదేవరాయులు వైసీపీకి అనధికారికంగా దూరమయ్యారు. దీనికంతటికీ జగన్‌కు తెలియకుండా తెలంగాణ సీఎం పీఠాన్ని దక్కించుకున్న ఎంపీ రేవంత్‌రెడ్డి ఆ పదవిని వీడి వస్తూ ఢిల్లీలో ఇటీవల అన్ని పార్టీల ఎంపీలకు విందు కారణమని సమాచారం. రేవంత్ విందుకు వైసీపీ ఎంపీలు 20 మంది వరకు వెళ్లారు. వైసీపీ ఎంపీలను ఆ విందుకు తీసుకెళ్లడంలో కృష్ణదేవరాయులు కీలక పాత్ర పోషించారు. తోటి ఎంపీ సీఎంగా ఇస్తున్న వీడ్కోలు విందుకు వెళ్లడం తప్పేమిటని మిగతా వైసీపీ ఎంపీలను ఒప్పించి తీసుకెళ్లారు. కృష్ణదేవరాయులతో సన్నిహితంగా ఉండే ఎంపీ వల్లభనేని బాలశౌరి కూడా ఈ విందు వ్యవహారంలో కో కెప్టెన్‌గా వ్యవహరించారు. రేవంత్‌రెడ్డి విందుకు వైసీపీ ఎంపీలు వెళ్లడంలో కృష్ణదేవరాయులు, బాలశౌరిలు కీలకపాత్ర వహించారనే కక్షతోనే సీట్లు మార్పిడి వంకతో వారు కోరుకున్న స్థానాల నుంచి పోటీ చేసే అవకాశం కల్పించకుండా జగన్ పొగపెట్టి దూరం చేసుకున్నట్లు సమాచారం. పల్నాడు జిల్లా మాచవరం మండలం మోర్జంపాడుకి చెందిన బాలశౌరికి గత ఎన్నికల్లో మచిలీపట్నం నుంచి పోటీ చేసి ఎంపీగా గెలుపొందారు. స్థానికేతరుడైనప్పటికీ ఆ నియోజకవర్గ అభివృద్ధికి తన వంతు కృషి చేసి తిరిగి మచిలీపట్నం నుంచే పోటీ చేయాలనే కోరికతో బాలశౌరి ఉన్నారు. ఈ క్రమంలో గుంటూరుపై ఆశతో ఉన్న క్రికెటర్ అంబటి రాయుడికి మచిలీపట్నం నుంచి పోటీ చేస్తేనే సీటు ఇస్తానని జగన్ ఆఫర్ ఇచ్చారు. సిట్టింగ్ ఎంపీగా ఉన్న తనను కాదని రాయుడిని పోటీ చేయమనటంతో బాలశౌరికి మండింది. అదేమిటని జగన్‌ను ప్రశ్నించగా 'సర్వేలో అక్కడ నుంచి తిరిగి నీకు గెలిచే అవకాశాలు లేవు... ఎమ్మెల్యేగా పోటీ చేసే అవకాశం అదే పార్లమెంటు పరిధిలో కల్పిస్తాను..' అంటూ బాలశౌరికి జగన్ సర్ది చెప్పే ప్రయత్నం చేసినట్లు తెలిసింది. ఈ ఆఫర్ వింతగా ఉండటంతో తనను పొమ్మనకుండా పొగబెడుతున్నారని భావించిన బాలశౌరి వైసీపీకి రాజీనామా చేయటం ద్వారా గుంటూరు మిర్చి ఘాటు చూపించారు. జనసేన, టీడీపీ కూటమి ద్వారా ఆయన అదే నియోజకవర్గం నుంచి ఎంపీ అభ్యర్థిగా బరిలోకి దిగే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతున్నది.

గుంటూరుకు బదిలీపై లావు గుడ్‌బై?

గుంటూరుకు చెందిన లావు శ్రీకృష్ణదేవరాయులు గత ఎన్నికల్లో నరసరావుపేట లోక్‌సభ స్థానం నుంచి పోటీ చేసి గెలుపొందారు. అప్పట్లో తొలుత లావుకు గుంటూరు ఎంపీ సీటునే ఇస్తానని జగన్ చెప్పడంతో 2019 ఎన్నికల సమయంలో ఏడాదికి ముందే విజయం కోసం వ్యూహ రచన చేసుకున్నారు. అయితే ఎన్నికలు సమీపించే సమయానికి ఈ సీటును మోదుగుల వేణుగోపాల్‌రెడ్డికి ఇచ్చేందుకు కృష్ణదేవరాయులును ఉన్న పళంగా నరసరావుపేటకు పంపారు. ఇక్కడ పడిన శ్రమంతా వృథా అవుతుందని గుంటూరు సీటు కోసం చేసిన ప్రయత్నాలు ఫలించకపోవడంతో అయిష్టంగానే నరసరావుపేట నుంచి పోటీ చేసేందుకు కృష్ణదేవరాయులు అంగీకరించారు. సుమారు లక్షన్నర ఓట్ల ఆధిక్యతతో లావు విజయం సాధించారు. అయితే వచ్చే ఎన్నికల్లో నరసరావుపేటపై ఆసక్తితో ఉండగా తిరిగి గుంటూరులో పోటీ చేయని జగన్ లావును ఆదేశించారు. దీంతో జగన్ జిగ్‌జాగ్ ఆడుతున్నాడని కృష్ణదేవరాయులు అధికారికంగా రాజీనామా చేసి జగన్‌కు గుడ్‌బై చెప్పేందుకు సిద్ధంగా ఉన్నారు. మానసికంగా కృష్ణదేవరాయులు వైసీపీని వీడినప్పటికీ మంచి ముహూర్తం చూసుకుని రాజీనామా చేసి టీడీపీలో చేరడం ఖాయమని సమాచారం.





కోర్టు ఆదేశాల మేరకు టీడీపీ అధినేత చంద్రబాబు గుంటూరులోని సీఐడీ కార్యాలయానికి శనివారం వచ్చారు. ఈ సందర్భంగా టీడీపీ నాయకులు, కార్యకర్తలు భారీగా తరలివచ్చి అధినేతకు సంఘీభావం తెలిపారు.

సొసైటీల్లో.. కమిటీల పాలనే

- మరో ఆరు నెలలు పొడిగిస్తూ ఉత్తర్వులు
- దొడ్డిదారిన కమిటీలతో పాలన కొనసాగింపు
- ఇక వైసీపీ హయాంలో సహకార ఎన్నికలు లేనట్లే
- ఐదేళ్లగా ఎన్నికలకు సాహసం చేయని ప్రభుత్వం



(నరసరావుపేట, ఆంధ్రజ్యోతి)

రైతుల భాగస్వామ్యంతో సహకార సంఘాలు పని చేయాలి. అయితే వారి భాగస్వామ్యం లేకుండా.. సంఘాల్లో వారి పాత్రను దూరం చేసేలే ప్రభుత్వం నిర్ణయం తీసుకుంటోంది. ఈ క్రమంలో మరో ఆరు నెలలు త్రిసభ్య కమిటీల ఆధ్వర్యంలోనే సహకార సంఘాల కార్యకలాపాలు జరగనున్నాయి. ఎన్నికలు నిర్వహించకుండా దొడ్డిదారిన కమిటీలతో ప్రభుత్వం పాలన సాగిస్తోంది. ఐదేళ్లుగా సహకార ఎన్నికలు నిర్వహించేందుకు ప్రభుత్వం సాహసం చేయడంలేదు. వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత సహకార సంఘాలలో త్రిసభ్య కమిటీల పాలనను కొత్తగా ప్రవేశ పెట్టింది. దీనిని కొనసాగించేందుకే ప్రభుత్వం మొగ్గుచూపింది. మరో ఆరు నెలలు ఆయా కమిటీల పాలనను కొనసాగిస్తూ శుక్రవారం ఉత్తర్వులను విడుదల చేసింది. పార్టీ నేతలకు పదవులు ఇచ్చుకునేందుకే ఎన్నికలను నిర్వహించడంలేదన్న విమర్శలు వస్తున్నాయి. అయినా వాటిని లెక్క చేయకుండా ప్రత్యేక కమిటీలనే కొనసాగిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. ఉమ్మడి గుంటూరు జిల్లాలో 167 సహకార సంఘాలు ఉన్నా యి. త్రిసభ్య కమిటీల పదవి కాలం ముగిసింది. దీంతో 18 నుంచి జూలై 17 వరకు ఆ కమిటీల పదవీ కాలం పొడగిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. రాజకీయాలకు అతీతంగా సహకార సంఘాలు పనిచేయాల్సి ఉండగా మితిమీరిన రాజకీయ జోక్యం ఉంటున్నది. దీంతో తీవ్ర అన్యాయం జరుగుతోందని రైతులు వాపోతున్నారు. ఎన్నికలు నిర్వహిస్తేనే సొసైటీలను బలోపేతం చేయడంతో పాటు రైతుల ప్రయోజనాలకు పెద్ద పీట వేసే అవకాశం ఉంటుంది. ఈ దిశగా ప్రభుత్వం స్పందించాలని రైతులు కోరుతున్నారు.

2013లో సహకార ఎన్నికలు

సహకార సంఘాలకు చివరగా 2013లో జరిగాయి. వాటి గడువు 2018లో ముగిసింది. అప్పటినుంచి ఎన్నికలు జరగలేదు. అప్పట్లో టీడీపీ ప్రభుత్వం సొసై టీల అధ్యక్షుల పదవీ కాలాన్ని 2019 వరకు పొడిగిం చింది. ఆ తర్వాత వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత ఎన్నికలు ఉంటాయని అందరూ ఎదురుచూశారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా ఓటరు జాబితాలను కూడా అధికారులు సిద్ధం చేశారు. తొలుత వైసీపీ ప్రభుత్వం ఎన్నికలు నిర్వహించనున్నట్లు ప్రకటించింది. ఇలా రెండుసార్లు ప్రకటనలు చేసినా ఎన్నికలను నిర్వహించేందుకు వైసీపీ ప్రభుత్వం సాహసం చేయలేదు. పైగా త్రిసభ్యకమిటీల పాలనను సొసైటీల్లో ప్రవేశ పెట్టింది.

ఇష్టారాజ్యంగా త్రిసభ్య కమిటీలు

జిల్లాలోని కొన్ని సహకార సంఘాలలో త్రి సభ్య కమిటీలు ఇష్టారాజ్యంగా వ్యవహరిస్తున్నాయన్న విమర్శలున్నాయి. ఎన్నికలు లేక పోవడంతో తాత్కాలిక కమిటీలు అక్రమాలకు తెరతీశాయని ఆరోపణలున్నాయి. కొన్ని చోట్ల రైతులను ఇబ్బందులకు గురిచేస్తున్నాయన్న విమర్శలున్నాయి. రాజకీయ కారణాలతో ఎప్పటి నుంచో పని చేస్తున్న ఉద్యోగులను తొలగించి వారి స్థానంలో కొత్త వారిని ఆయా కమిటీలు నియమించుకున్నాయన్న ఆరోపణలున్నాయి. మార్చి 2019 కన్నా ముందుగా సొసైటీలలో పని చేస్తున్న సిబ్బందిని పర్మినెంట్ చేసేందుకు గత ప్రభుత్వం ఉత్తర్వులు విడుదల చేసింది. ఉద్యోగులను క్రమబద్ధీకరించేందుకు 2020 డిసెంబరులో ప్రభుత్వం మరోసారి ఉత్తర్వులు జారీ చేసింది. ఈ ఉత్తర్వులను తుంగలో తొక్కి అక్రమ మార్గంలో ఉద్యోగులను కొన్ని త్రి సభ్య కమిటీలు నియమించుకున్నట్లు ఆరోపణలున్నాయి. ఇలా నియామకాలకు లక్షల్లో డబ్బు చేతులు మారినట్లు ప్రచారం ఉంది. ఆయా నియామకాలపై విచారణ జరిగితే అక్రమాలు వెలుగుచూసే అవకాశం ఉంది.

మేరిమాత మహోత్సవంలో లోకేశ్

- ఉండవల్లిలో తటస్థులతో యువనేత

తాడేపల్లి, జనవరి 13: స్థానిక కుంచనపల్లిలో మేరిమాత మహోత్సవంలో యువనేత, టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ శనివారం పాల్గొన్నారు. మేరిమాత విగ్రహం వద్దకు వచ్చి టెంకాయ కొట్టి అనంతరం ప్రత్యేక ప్రార్థనల్లో పాల్గొన్నారు. అనంతరం ఉండ వల్లిలోని తటస్థ ప్రముఖులను కలుసుకుని వారి మద్దతు కోరారు. బీసీ నేత వల్లభాపురం నాగేశ్వరరావు ఇంటికి వెళ్లి మర్యాదపూర్వకంగా కలుసుకున్నారు. రజకులు ఎదుర్కొంటున్న వృత్తిపరమైన సమస్యలను నాగేశ్వరరావు లోకేశ్ దృష్టికి తీసుకువచ్చారు. పాదయాత్రలో రజకుల సమస్యలను పూర్తిగా అధ్యయనం చేశానని వారికోసం అత్యాధునిక సమీకృత ధోబీ ఘాట్లు ఏర్పాటుచేస్తామని చెప్పారు. అనంతరం నాగేశ్వరరావు కుటుంబసభ్యులు లోకేశ్‌ను సత్కరించారు. ఈ సందర్భంగా లోకేశ్ చిన్నారులకు స్వీట్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లోకేశ్ వెంట స్థానిక సంఘస్తులు, టీడీపీ మండల అధ్యక్షులు అమరా సుబ్బారావు, మార్కు తదితరులు ఉన్నారు.

లోకేశ్‌కు స్వాగతం పలుకుతున్న స్థానికులు




పార్టీలోకి ఆహ్వానిస్తున్న జీవీ ఆంజనేయులు

వైసీపీ నుంచి టీడీపీలోకి 150 కుటుంబాలు

● రానున్న కాలంలో పెద్దసంఖ్యలో చేరికలు ● టీడీపీ జిల్లా అధ్యక్షుడు జీవీ

వినుకొండ, జనవరి 13: స్థానిక నరసరావుపేట రోడ్డులోని జీవీ గెస్ట్‌హౌస్‌లో నూజెండ్ల మండలం ముప్పరాజువారిపాలేనికి చెందిన సర్పంచ్ నిమనూరు మాధవి శ్రీను ఆధ్వర్యంలో 150 కుటుంబాలు పల్నాడు జిల్లా టీడీపీ అధ్యక్షుడు, మాజీ ఎమ్మెల్యే జీవీ ఆంజనేయులు సమక్షంలో శనివారం వైసీపీని వీడి టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా పార్టీలో చేరినవారికి కండువాలు కప్పి పార్టీలో జీవీ ఆహ్వానించారు. పార్టీలో చేరినవారిలో ముప్పరాజు రామలింగయ్య (వైస్‌సర్పంచ్), రామారావు, రవి, గోరంట్ల అంజయ్య, ఐనీడి వెంకట్రావు, ముళ్లమూరు శ్రీను, వెంకటేశ్వర్లు, దేవరపల్లి పెదకాశయ్య, షేక్ మాబుసుభాని, ఆటో కాలేషా, దాసరి లింగయ్య, కందుల ఏలయ్య, బోసుబోతుల చిన్నలింగయ్య, ముప్పరాజు వెంకటరామయ్య ఉన్నారు. అనంతరం జీవీ మాట్లాడుతూ రాష్ట్రంలో అన్నివర్గాల ప్రజలను జగన్‌రెడ్డి మోసం చేశారన్నారు. సైకో పాలనకు చరమగీతం పాడేందుకు వైసీపీ నాయకులు జనసేన, టీడీపీలో చేరేందుకు సిద్ధమయ్యారన్నారు. గ్రామాలు అభివృద్ధి చెందాలంటే మళ్లీ టీడీపీ అధికారంలోకి రావాలని ప్రజలు కోరుకుంటున్నట్లు తెలిపారు. పార్టీలో చేరినవారికి అండగా ఉంటానని హామీ ఇచ్చారు. గెలుపు కోసం ప్రతిఒక్కరూ కష్టపడి పనిచేయాలని, కార్యకర్తలకు సముచితస్థానం కల్పిస్తామన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు మీసాల మురళీకృష్ణయాదవ్, డీఎల్‌డీఏ ఛైర్మన్ లగడపాటి వెంకట్రావు, బచ్చు అంజిరెడ్డి, వంకాయలపాటి పేరయ్య, గంగినేని ఆంజయ్య, బొట్ల అంజయ్య, సోమేపల్లి బ్రహ్మయ్య, ముంద్రు సుబ్బారావు, గుర్నాథం, బుల్లేశ్వరరెడ్డి, బత్తుల సుబ్బారావు, మేదరమెట్ల అనిల్, మరిడి సురేష్ పాల్గొన్నారు.

రాష్ట్ర సంపద అమరావతిపై అభాండాలు

● ప్రభుత్వ తీరు మారకుంటే ప్రజాగ్రహం తప్పదు ● 1488వ రోజుకు రైతుల ఆందోళనలు

తుళ్లూరు, జనవరి 13: రాష్ట్ర సంపదైన అమరావతిపై వైసీపీ పాలకులు అనేక అభాండాలు వేశారని రాజధాని అమరావతికి 33వేల ఎకరాలు త్యాగం చేసిన రైతులు ఆగ్రహం వ్యక్తం చేశారు. బిల్డ్ అమరావతి, సేవ్ ఆంధ్రప్రదేశ్ అంటూ రైతులు, రైతు కూలీలు, మహిళలు చేస్తున్న ఆందోళనలు శనివారం నాటికి 1488వ రోజుకు చేరుకున్నాయి. ఈ సందర్భంగా రైతు ధర్నా శిబిరాల నుండి వారు మాట్లాడుతూ, మూడు రాజధానులని వైసీపీ ప్రభుత్వం ఆడుతున్న డ్రామాలు ఆపకపోతే ప్రజాగ్రహానికి గురికాక తప్పదన్నారు. మూడు రాజధానులు కావాలని ఎవరూ అడగలేదన్నారు. మూడు ముక్కల ఆట వైసీపీ పాలకుల సొంత ప్రయోజనాల కోసం పెట్టిన అంశమన్నారు. ప్రజా రాజధాని అమరావతేనని పేర్కొన్నారు. అమరావతిని వ్యతిరేకిస్తే ఐదు కోట్ల మంది తెలుగువారిని వ్యతిరేకించినట్లేనన్నారు. వైసీపీ పాలకులు రాష్ట్ర రాజధానిని నాశనం చేసే దుర్మార్గపు ఆలోచనతో ఉన్నారన్నారు. రాష్ట్ర ఉన్నత న్యాయస్థానం తీర్పు అంటే గౌరవం లేకుండా వైసీపీ పాలకులు వ్యవహరిస్తున్నారన్నారు. మూడు ముక్కల ఆట రాష్ట్రాభివృద్ధికి ఆటంకమన్నారు. రాష్ట్ర ఏకైక రాజధాని అమరావతే.. అన్ని ప్రాంతాల అభివృద్ధికి దోహదమన్నారు. అమరావతి వెలుగు కార్యక్రమం కొనసాగింది. బిల్డ్ అమరావతి అంటూ దీపాలు వెలిగించి నినాదాలు చేశారు. రాజధాని 29 గ్రామాలలో ఆందోళనలు కొనసాగాయి.


బిల్డ్ అమరావతి అంటూ మందడం రైతు ధర్నా శిబిరంలో నినాదాలు చేస్తున్న రైతులు


రుద్రవరంలో టీడీపీలో చేరినవారితో కన్నా లక్ష్మీనారాయణ

జగన్ అసమర్థ పాలనతో విసిగిపోయిన ప్రజలు

● చంద్రబాబు అఖండ మెజారిటీతో సీఎం అవుతారు: కన్నా
● టీడీపీలో చేరిన మాదల, రుద్రవరంలోని పలువురు వైసీపీ కార్యకర్తలు

ముప్పాళ్ళ, జనవరి 13: జగన్ అవినీతి, అసమర్థ పాలనతో రాష్ట్ర ప్రజలు విసిగి పోయి తెలుగుదేశం వైపు చూస్తున్నారని సత్తెనపల్లి నియోజకవర్గ టీడీపీ ఇన్‌చార్జి కన్నా లక్ష్మీనారాయణ అన్నారు మండలంలోని మాదల, రుద్రవరం గ్రామాలలో వైసీపీ కార్యకర్తలు పలువురు కన్నా సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కన్నా పార్టీ కండువాను కప్పి ఆహ్వానించాడు. ఈ సందర్భంగా కన్నా మాట్లాడుతూ రాష్ట్రం జగన్ చేతకాని పాలనలో 20 సంవత్సరాల వెనక్కువెళ్ళిందన్నారు. రాష్ట్రం మరలా అభివృద్ధి చెందాలంటే చంద్రబాబు నాయుడుకు మాత్రమే సాధ్యమని ప్రజలు నమ్ముతున్నారన్నారు. అందుకే రాష్ట్రంలో పెద్దఎత్తున వైసీపీని వీడి టీడీపీలో చేరుతున్నారన్నారు. పార్టీలో చేరిన వారందరికీ సముచిత స్థానం కల్పిస్తామన్నారు. ముందుగా రుద్రవరంలో మాజీ సభాపతి డాక్టర్ కోడెల శివప్రసాదరావు విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు బత్తుల నాగేశ్వరరావు, రావిపాటి మధుబాబు, తెలుగురైతు నియోజకవర్గ అధ్యక్షుడు రావిపాటి నానయ్య, సురేష్ తదితరులు పాల్గొన్నారు.


సంక్రాంతి కానుకలు అందజేస్తున్న మన్నవ మోహనకృష్ణ

సంక్రాంతి కానుకల పంపిణీకి పోలీసుల అడ్డంకి

● ఇంటింటికీ తిరిగి అందజేసిన టీడీపీ నేత మోహనకృష్ణ
● గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో పదివేల మందికి కానుకలు
● చంద్రబాబు స్ఫూర్తితో పేదల కళ్లలో ఆనందం కోసమేనన్న మన్నవ

గుంటూరు, జనవరి 13 (ఆంధ్రజ్యోతి): పోలీసులు శాంతిభద్రతలు కాపాడాలి. కాని వైసీపీ అధికారంలోకి వచ్చిన తర్వాత టీడీపీ ఇతర పక్షాలకు సంబంధించిన కార్యక్రమాలను అడ్డుకోవడమే ధ్యేయంగా విధులు నిర్వహిస్తున్నారు. వివిధ వర్గాల నుంచి విమర్శలు వస్తున్నా పోలీసులు పట్టించుకోవడంలేదు. టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి మన్నవ మోహనకృష్ణ సంక్రాంతి సందర్భంగా చంద్రన్న సంక్రాంతి కానుకలను పంపిణీ చేయాలని నిర్ణయించుకున్నారు. అయితే అందుకు పోలీసులు అనుమతించలేదు. అయినా ఆయన వెనక్కి తగ్గకుండా ఇంటింటికీ తిరిగి స్వయంగా చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేసే కార్యక్రమాన్ని శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు స్ఫూర్తితో పేదల కళ్లలో ఆనందం కోసం పశ్చిమ నియోజకవర్గంలో పది వేల మందికి కానుకలను పంపిణీ చేస్తామని ఆయన తెలిపారు. పండగ పూట ప్రతి లోగిలి సంతోషంగా ఉండాలనే ఉద్దేశంతో ఆనాడు టీడీపీ ప్రభుత్వం చంద్రన్న కానుక పేరుతో సంక్రాంతి, రంజాన్, క్రిస్మస్ కానుకలు అందించిందన్నారు. అయితే వైసీపీ అధికారంలోకి రావడంతోనే ఆయా పండుగ కానుకలను రద్దు చేసి పేదల పొట్టగొట్టిందన్నారు. గతంలో అనేక పండుగలకు చంద్రన్న కానుకలను అందచేశామన్నారు. పోలీసులు అనేక ఆంక్షలు విధిస్తూ ఈ కార్యక్రమ నిర్వహణకు అనుమతి నిరాకరించారని తెలిపారు. దసరా పండుగ సందర్భంగా దసరా చంద్రన్న కానుక పంపిణీకి కూడా పోలీసులు అనుమతి నిరాకరించారని గుర్తుచేశారు. ఈసారి పేదలకు ఎలాగైన సంక్రాంతి కానుక అందించాలనే లక్ష్యంతో తానే ఇంటింటికి వెళ్లి నిత్యావసర సరుకులతో కూడిన చంద్రన్న సంక్రాంతి కానుకలు అందజేశామన్నారు. చంద్రబాబు పేరు మీద ఈ కార్యక్రమం చేపట్టడం సంతృప్తినిచ్చిందని తెలిపారు.


కోనూరులో డాక్టర్ కొమ్మాలపాటి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ కార్యకర్తలు

కార్మికులకు పనులు కల్పించకుండా ఇసుక దోపిడీ

● సీఎం జగన్‌కు యావజ్జీవం తప్పదు
● మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ధ్వజం

అచ్చంపేట, జనవరి 13: ముఖ్యమంత్రి జగన్‌మోహన్‌రెడ్డికి యావజ్జీవ జైలు శిక్ష తప్పదని మాజీ ఎమ్మెల్యే డాక్టర్ కొమ్మాలపాటి శ్రీధర్ ధ్వజమెత్తారు. శనివారం కోనూరులోని ఎస్సీ కుటుంబాలకు చెందిన వైసీపీ కార్యకర్తలు శ్రీధర్ సమక్షంలో టీడీపీలో చేరారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎస్సీలు, ఎస్టీలకు, కూలీలకు ఇసుక పనులు కల్పించకుండా ఇసుక దోపిడీ చేస్తున్నారని ఆరోపించారు. శ్రీకాకుళం నుంచి చిత్తూరు వరకు జగన్‌రెడ్డి పెత్తందారి పోకడలను వైసీపీ ఎమ్మెల్యేలు, ఎంపీలే బహిరంగంగా ఎండగడుతున్నారన్నారు. ఈ పరిస్థితి నుంచి ప్రజల దృష్టిని మరల్చేందుకు సీఐడీని అడ్డం పెట్టుకొని చంద్రబాబుపై కేసులు నమోదు చేయించి జగన్ తన సొంత మీడియాలో దుష్ప్రచారాలకు దిగుతున్నారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డిపై ఉన్న కేసుల్లో 12 సంవత్సరాలుగా 3,500 వాయిదాలు తీసుకున్నారన్నారు. జగన్ ఒత్తిడితో సీబీఐ నమోదు చేసిన కేసుల్లో చంద్రబాబును ఇరికించినా కోర్టుకు ఆధారాలు చూపలేకపోయారన్నారు. 2004లో కొద్ది ఆస్తులు ఉన్న జగన్‌రెడ్డి నేడు నాలుగు లక్షల కోట్లకు ఎలా ఎదిగారని ప్రశ్నించారు. జగన్ చేసిన నిలువు దోపిడీపై ప్రజల దృష్టిని మరల్చేందుకు సీఐడీతో చంద్రబాబుపై అక్రమ కేసులు పెట్టి 53 రోజులు జైల్లో నిర్బంధించారన్నారు. జగన్‌మోహన్‌రెడ్డి అవినీతి, అక్రమాలను పలు సందర్భాల్లో కోర్టులు తప్పుబట్టాయన్నారు.

ఐదు రోజులకు 7వేల యూనిట్లు

● విద్యుత్ హైసెక్యూరిటీ మీటర్లతో గుండె దడ ● బెంబేలెత్తుతున్న రైస్ మిల్లర్లు
● పూర్తి బిల్లు చెల్లించాలని హుకుం జారీ చేస్తున్న అధికారులు


వేమూరులోని ఓ రైస్ మిల్లులకు రీడింగ్‌తో సంబంధం లేకుండా అధిక మొత్తంలో జారీ అయిన విద్యుత్ బిల్లు


రైస్ మిల్లులకు కొత్తగా ఏర్పాటు చేసిన హై సెక్యూరిటీ మీటర్లు

వేమూరు, జనవరి 13: ఇటీవల రైస్ మిల్లుల్లో రాష్ట్ర ప్రభుత్వం ట్రాన్స్‌కో శాఖ ద్వారా ఏర్పాటుచేసిన హైసెక్యూరిటీ మీటర్ల ద్వారా ఊహించని రీతిలో బిల్లులు రావడంతో మిల్లుల యజమానులు బెంబేలెత్తుతున్నారు. డిసెంబర్ 27న హైసెక్యూరిటీ మీటర్లు బిగించారు. ఒకటి రెండు తేదీలలో రీడింగు నమోదు చేశారు. కేవలం ఐదు రోజుల వ్యవధిలోనే ఒక్కొక్క మిల్లుకు 15వేల నుండి 50వేలపై దాకా అధిక మొత్తంలో బిల్లులు రావడంతో మిల్లర్లలో ఆందోళన వ్యక్తమవుతోంది. ఐదు రోజులకే పెద్ద మొత్తంలో బిల్లులు రావడం వల్ల నెల రోజుల వ్యవధికి ఇంకెంత వస్తుందోనని ఆందోళన చెందుతున్నారు. వేమూరులోని లక్ష్మీగణపతి రైస్ మిల్లులో కేడబ్ల్యూహెచ్ రీడింగ్ పరిశీలిస్తే 3685 యూనిట్లు మంజూరైన బిల్లులో చూపింది. అయితే అదే బిల్లులో కేవీ ఏహెచ్ బిల్లింగ్ అంటూ పై రీడింగ్ బిల్ పక్కన 10167 యూనిట్లు రీడింగ్ చూపడంతో పాటు అదనంగా 6,482 యూనిట్లకు రూ.67,442 అదనపు బిల్లు చెల్లించాలంటూ రీడింగ్ నోటీసులు జారీ చేశారు. అలాగే విజయలక్ష్మీ రైస్ మిల్లులో కూడా 1082 యూనిట్లు తేడా రావడం వల్ల రూ.13వేలు అదనపు బిల్లు చూపింది. మరో వింతేమిటంటే మిల్లు ఆన్ చేయకుండానే రీడింగ్ చూపటం విశేషం. గతంలో సాధారణ మీటర్లు ఉండేవని, అప్పుడు లేని సమస్య హైసెక్యూరిటీ మీటర్లు ఏర్పాటుచేసిన తర్వాత ఏర్పడిందని మిల్లర్లు వాపోతున్నారు. మిల్లుల స్థాయిని బట్టి కెపాసిటర్లను కూడా పెంచి ఏర్పాటుచేశామని, వాటిని తొలగించి ఆటోమేటిక్ కెపాసిటర్లు పెట్టాలని ప్రభుత్వం అధికారుల ద్వారా ఒత్తిడి తెస్తున్నట్లు తెలిపారు. ఆటోమేటిక్ కెపాసిటర్లు కనుక ఏర్పాటు చేస్తే వాటి ద్వారా కూడా రీడింగ్ మరింతగా పెరిగే అవకాశం ఉందని, ఆ విధానాన్ని అమలు పరచొద్దని కోరుతున్నారు. జారీ అయిన బిల్లులు చెల్లించక తప్పదని ట్రాన్స్‌కో అధికారులు హుకుం జారీ చేస్తున్నట్లు యజమానులు వాపోతున్నారు. ప్రభుత్వం స్పందించి కొత్తగా ఏర్పాటుచేసిన హైసెక్యూరిటీ మీటర్లను తొలగించి వాటి స్థానంలో సాధారణ మీటర్లను ఏర్పాటుచేయాలని కోరుతున్నారు. ఈ విషయంపై ట్రాన్స్‌కో ఏఈ గోపిని వివరణ కోరగా హైసెక్యూరిటీ మీటర్ల విషయం తమ దృష్టికి వచ్చిందని, దీనిపై ఉన్నతాధికారుల అనుమతితో వాటిని పరిశీలించి సహకరిస్తామన్నారు.

ఎన్నికల తరువాత వైసీపీ గల్లంతు

● జగన్‌కు జైలు ఖాయం ● మాజీ మంత్రి ప్రత్తిపాటి



చిలకలూరిపేట అర్బన్, జనవరి 13: ఎన్నికల తరువాత వైసీపీ అడ్రస్ గల్లంతు కావటం, జైలుకు పోవటం ఖాయమని మాజీ మంత్రి, టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు ప్రత్తిపాటి పుల్లారావు అన్నారు. ప్రభుత్వ వ్యతిరేకతపై ప్రజల దృష్టి మరల్చేందుకు జగన్ నానా అడ్డదారులు తొక్కుతున్నారని ధ్వజమెత్తారు. తండ్రి అధికారాన్ని అడ్డం పెట్టుకొని వేలకోట్లు వెనకేసుకున్న జగన్ అసలు రాజకీయాలకు, ప్రజాసేవకు అనర్హుడన్నారు. ఆదివారం నుంచి తెలుగుదేశం పార్టీ ప్రారంభించనున్న రా కదలి రా... కార్యక్రమ సన్నాహాలపై టీడీపీ ముఖ్య నేతలతో శనివారం తన నివాసంలో సమీక్షించిన అనంతరం మీడియాతో మాట్లాడారు. టీడీపీ అధినేత చంద్రబాబుపై వైసీపీ సర్కారు కక్ష సాధింపు చర్యలు, అక్రమకేసులపై నిప్పులు చెరిగారు. చిత్తూరు నుంచి శ్రీకాకుళం వరకు జగన్ నిరంకుశ పాలనను జనం తరిమి కొట్టే రోజు త్వరలోనే ఉందన్నారు. రూ.43వేల కోట్ల దోపిడీపై సీబీఐ, ఈడీ 38 కేసులు పెడితే కనీసం కోర్టు వాయిదాలకు హాజరుకాకుండా తప్పించుకు తిరుగుతున్న దొంగ జగన్ అని ఎద్దేవా చేశారు. సీబీఐ కేసుల్లో వాయిదాలే ఊపిరిగా జగన్ రాజకీయ జీవితం ఉందన్నారు. ఈ కేసులకు తోడు ఈ ఐదు సంవత్సరాల్లో జగన్ చేసిన అవినీతిపై టీడీపీ అధికారంలోకి రాగానే జగన్ కొత్త కేసులు ఎదుర్కోక తప్పదన్నారు. టీడీపీ, జనసేన ప్రభుత్వంలో అభివృద్ధి, సంక్షేమంతో పాటు జగన్ హయాంలో జరిగిన అవినీతిపై కచ్చితంగా చర్యలు ఉంటాయని ప్రత్తిపాటి పేర్కొన్నారు.

ఫిబ్రవరి 23, 24న చలపతి ఉద్గోష్2కే24

మోతడక(తాడికొండ), జనవరి 13: మోతడక చలపతి ఇంజనీరింగ్ కళాశాలలో ఫిబ్రవరి 23, 24 తేదీల్లో చలపతి ఉద్గోష్-24 కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నట్లు ఛైర్మన్ వై.వీ.ఆంజనేయులు పేర్కొన్నారు. శనివారం కళాశాలలో చలపతి ఉద్గోష్ 2కే24 బ్రోచర్లను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 23, 24 తేదీలలో యువజన దినోత్సవాన్ని పురస్కరించుకొని జాతీయ స్థాయి టెక్నో, కల్చరల్, క్రీడా పోటీలు ఉద్గోష్ నిర్వహిస్తున్నట్లు తెలిపారు. పోటీలలో ప్రతిభ కనబరిచిన విద్యార్థులకు నగదు బహుమతి, మెరిట్ సర్టిఫికెట్ అందజేస్తామన్నారు. కార్యక్రమంలో కళాశాల కార్యదర్శి వై.సుజిత్‌కుమార్, ప్రిన్సిపాల్ డాక్టర్ కే కిరణ్‌కుమార్, డైరెక్టర్ డీ.వినయ్ కుమార్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కే నాగ శ్రీనివాసరావు, ప్రోగ్రాం కో ఆర్డినేటర్ వీ.సాయి శ్రీనివాస్, స్టూడెంట్ కో ఆర్డినేటర్ కే జయంత్, వివిధ శాఖాధిపతులు, అధ్యాపకులు పాల్గొన్నారు.


చలపతి ఉద్గోష్ బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న వైవీ ఆంజనేయులు

అంతర్రాష్ట్ర దొంగలు అరెస్టు

● 80 లక్షల విలువైన బంగారం, వెండి, కార్లు, ద్విచక్ర వాహనాలు స్వాధీనం
● పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి


స్వాధీనం చేసుకున్న బంగారు నగలును పరిశీలిస్తున్న ఎస్పీ రవిశంకర్‌రెడ్డి

దాచేపల్లి, జనవరి 13: వివిధ ప్రాంతాలలో దొంగతనాలకు పాల్పడిన వ్యక్తులను అరెస్టు చేసి వారి నుండి రూ.80 లక్షల విలువైన బంగారం, వెండి, ద్విచక్ర వాహనాలు, కార్లను స్వాధీనం చేసుకున్నట్లు పల్నాడు జిల్లా ఎస్పీ రవిశంకర్‌రెడ్డి శనివారం తెలిపారు. దాచేపల్లి పోలీస్‌స్టేషన్‌లో విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ పట్టుబడిన దొంగల నుండి 80 లక్షల విలువైన సొమ్ము, రూ.20 లక్షల విలువైన కార్లు నాలుగు, రూ.8.5 లక్షల విలువైన 15 ద్విచక్ర వాహనాలు, రూ.50 లక్షల విలువైన 850 గ్రాముల బంగారు నగలు, లక్షన్నర విలువ కలిగిన రెండున్నర కేజీల వెండి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. పల్నాడు జిల్లా రెంటచింతల మండలం గోలి గ్రామానికి చెందిన పొన్నూరు చినసత్యానందం, పిడుగురాళ్లకు చెందిన రుద్రాల సురేష్, పెదగార్లపాడుకు చెందిన షేక్ ఇమాంషా, మరో 10మంది వివిధ ప్రాంతాలకు చెందిన వ్యక్తుల నుంచి వీటిని స్వాధీనం చేసుకున్నట్లు వివరించారు. దాచేపల్లి, పిడుగురాళ్ల, మాచవరం, గురజాల, అద్దంకి, చేబ్రోలు, మాచర్ల, దుర్గి, ఏలేశ్వరం, పిఠాపురం, ఈపూరు, సత్తెనపల్లి, కారంపూడి, మిర్యాలగూడ ప్రాంతాలలో వీరిపై 25 కేసులు నమోదైనట్లు వివరించారు. ప్రధానంగా తాళాలు వేసిన ఇళ్లను లక్ష్యంగా చేసుకొని బంగారం, వెండి, కార్లు, బైక్‌లను దొంగతనం చేసినట్లు తెలిపారు. నిందితులపై పీడీ యాక్ట్ నమోదు చేసినట్లు వివరించారు. దొంగలను పట్టుకునేందుకు ఎస్ఐలు నాగరాజు, సంధ్యారాణిలు, షేక్ సమీర్‌బాషా, హెచ్‌సీ రాఘవయ్య, పీసీలు వెంకట్రావు నాయక్, జబ్బార్‌లాల్ నాయక్, కోటేశ్వరరావు, పవన్, గోవిందు నాయక్, అరుణకుమార్, సాంబశివరావు శ్రమించి నిందితులను అరెస్టు చేశారన్నారు. ఈ సందర్భంగా సిబ్బందికి ఎస్పీ రవిశంకర్‌రెడ్డి అభినందనలు తెలిపి రివార్డులను అందజేశారు. కార్యక్రమంలో గురజాల డీఎస్పీ పళ్లంరాజు, సీఐ సురేంద్రబాబు తదితరులు పాల్గొన్నారు.

నెక్ సూచించిన కోడిగుడ్ల ధర

● విజయవాడ జోన్ ప్లాస్టిక్ ట్రేలో సరఫరా చేసే ఫారం గేటు గుడ్డు ధర రూ.5.55 ● నెక్ విజయవాడ ఆఫీస్ ఫోన్: 74165 82559

బ్రాయిలర్ ధరలు

అమరావతి పౌల్ట్రీ ఫార్మర్స్ & ట్రేడర్స్ వెల్ఫేర్ అసోసియేషన్

బ్రాయిలర్ బర్డ్	106, 114, 125
చికెన్ విత్ స్కిన్	204.00
చికెన్ స్కిన్ లెస్	214.00

గుంటూరు సిటీ వార్తలు

◆ గుంటూరు తూర్పు ◆ పశ్చిమ

మా ప్రయాణం తెలుగుదేశంతోనే..

● రాయపాటి సాంబశివరావు, శ్రీనివాసరావు

గుంటూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): 'మా ప్రయణం తెలుగుదేశం పార్టీతోనే ఉంటుందని మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావులు తేల్చి చెప్పారు. రాయపాటి సాంబశివ రావు కుమారుడు రంగారావు టీడీపీకి రాజీనామా నేపథ్యంలో జరిగిన పరిణామాలపై 'ఆంధ్రజ్యోతి' శనివారం రాయపాటి సోదరులను సంప్రదిం చింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రంగారావుది వ్యక్తిగత నిర్ణయం, ఆయన నిర్ణయంతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తాము టీడీపీలో చేరిన నాటి నుంచి చంద్రబాబు వెంటే వున్నామని, ఇక ముందు కూడా చంద్రబాబుతోనే నడుస్తామని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో టీడీపీ, చంద్రబాబును వీడేది లేదని తెలిపారు. వయోభారం రీత్యా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడంలో తాము కాస్త నెమ్మదించామే తప్ప, తమ కుటుంబ సభ్యులందరూ పార్టీతోనే నడుస్తున్నారని చెప్పారు. ఇకపై తమ ప్రయాణం తెలుగుదేశంతోనే ఉంటుందని స్పష్టం చేశారు.

రాయపాటి కుటుంబం ఎప్పటికీ టీడీపీతోనే: రాయపాటి శైలజ

రాయపాటి కుటుంబం ఎప్పటికీ టీడీపీతోనే ఉంటుందని, టీడీపీని వీడి పోతుందనే ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదని అమరావతి జేఏసీ మహిళానేత, రాయపాటి సోదరుడి కుమార్తె రాయపాటి శైలజ స్పష్టంచేశారు. రాయపాటి రంగారావు రాజీనామా అనేది ఆయన వ్యక్తిగత నిర్ణయమని, దానికి తమ కుటుంబ సభ్యుల మద్దతు లేదని, ఆమె ఓ వీడియోలో స్పష్టం చేశారు. రంగారావు చర్యలు, మాటలకు తమకు ఎలాంటి సంబంధలేదని అన్నారు. 2014లో కాంగ్రెస్‌ను వీడి టీడీపీలోకి వచ్చిననాటి నుంచి ఇప్పటి వరకూ టీడీపీతోనే నడుస్తున్నామని, ఇకముందు నడుస్తామని, త్వరలో కుటుంబ సమేతంగా మీడియా ముందుకు వచ్చి ఈ విషయాన్ని స్పష్టం చేస్తామని రాయపాటి శైలజ తెలియజేశారు.

ఏఐఎస్‌టీఎఫ్ ఆర్థిక కార్యదర్శిగా జోసెఫ్ సుధీర్‌బాబు



సీహెచ్ సోసెఫ్ సుధీర్‌బాబు

గుంటూరు(విద్య),జనవరి13: ఆలిండియా సెకండరీ స్కూల్ టీచర్ ఫెడరేషన్ (ఏఐఎస్ టీఎఫ్) ఆర్థికకార్యదర్శిగా ఎస్టీయూ రాష్ట్ర పూర్వ అధ్యక్షుడు జోసెఫ్ సుధీర్ బాబు ఎన్నికయ్యారు. శనివారం కర్నూలులో నిర్వ హించిన సదస్సులో గుంటూరుజిల్లాకు చెందిన సీహెచ్ జోసఫ్‌సుధీర్‌బాబు ఏఐఎస్ టీఎఫ్ ఆర్థిక కార్యదర్శిగా ఏకగ్రీవంగా ఎన్నికై నట్లు ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు డీ.పెద బాబు శనివారం ఒక ప్రకటనలో పేర్కొ న్నారు. జోసెఫ్‌సుధీర్‌బాబు ఎస్టీయూ జిల్లా, రాష్ట్ర అధ్యక్షుడిగా, ప్రధాన కార్యదర్శిగా, ఫ్యాప్టో రాష్ట్ర చైర్మన్‌గా, ఏపీ జేఏసీ ప్రధాన కార్యదర్శిగా విధులు నిర్వర్తించారు. ఇప్పుడు ఏఐఎస్‌టీఎఫ్ ఆర్థిక కార్యదర్శిగా ఎన్నికవడంపై ఎస్టీయూ జిల్లా అధ్యక్ష ప్రధాన కార్యదర్శులు డీపెదబాబు, సుబ్బారెడ్డి హర్షం వ్యక్తంచేశారు.

56వ డివిజన్‌లో 'బాబు ష్యూరిటీ..

గుంటూరు, జనవరి13: బాబుష్యూరిటీ భవిష్యత్తుకు గ్యారెంటీ కార్య క్రమంలో భాగంగా గుంటూరు తూర్పు నియోజకవర్గం 56వ డివిజన్ నెహ్రూ నగర్ 2,3 లైన్లలో టీడీపీ నేతలు ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా తూర్పు ఇన్‌చార్జి మొహమ్మద్ నసీర్ టీడీపీ అధికారంలోకి వచ్చిన వెంటనే ఇచ్చే సంక్షేమ పథకాలను వివరించారు. ఈ సందర్భంగా నసీర్ మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చిన దగ్గరనుండి పేద మధ్యతరగతి ప్రజలు పండుగలు కూడా సంతోషంగా చేసుకోలేని స్థితిలోకి వచ్చారని రాష్ట్రంలో ఎన్నడూ లేని విధంగా నిత్యవసర సరుకుల ధరలు, పెట్రోల్ డీజిల్, కరెంట్ బిల్లులు, ఆర్టీసీ చార్జీలో పెరుగుదల తో ప్రజలు ఇబ్బందులతో వచ్చే సంపాదనలో పన్నుల రూపంలో జగన్ రెడ్డి లాక్కునే విధంగా బాదుడు బాదుతున్నాడని గతంలో చంద్రబాబు నాయుడు అధికారంలో ఉన్నప్పుడు ఏపండుగ వచ్చినా వారి ఇంట్లోకి సరిపడా సరుకు లను అందజేసేవారని, కానీ జగన్ రెడ్డి వచ్చాక వాటన్నిటిని నిలిపేసి వారిని పండుగ సంతోషానికి దూరం చేశారని ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమం టీడీపీ నేతలు కాలం ముకుందరావు, గుడిపల్లి వాణి, నవీన్,బత్తిన శంకర్, యర్రగొపు నాగేశ్వరావు,యద్దాల రమేష్, శేషయ్య, ట్. రామకృష్ణ, గొడుగు శంకర్, అరవపల్లి శ్రీనివాస్, సావిత్రి, లోకేశ్వరి, కుమారి, సముద్రాల గణేష్, శేఖర్, రావణ్, మల్లికా, సుఫియా తదితరులు పాల్గొన్నారు.

19న విశాఖపట్నం పోర్టు అథారిటీ ట్రేడ్ మీట్

గుంటూరు సిటీ, జనవరి 13: గుంటూరు జిల్లాలోని ఎగుమతి, దిగుమతిదారుల కోసం విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన ట్రేడ్ మీట్‌ను ఏర్పాటుచేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ అధ్యక్షుడు భాస్కరరావు శనివారం తెలిపారు. గుంటూరులోని వెల్‌కమ్ హోటల్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ భాగస్వామ్యంతో ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మిర్చి, పత్తి, పత్తినూలు, పొగాకు, రొయ్యలు, గ్రానైట్, బియ్యం ఎక్కువగా గుంటూరు జిల్లా నుండి ఎగుమతి అవుతున్నందువల్ల ఈ ట్రేడ్‌మీట్ ఇక్కడ ఏర్పాటుచేస్తున్నట్లు భాస్కరరావు అన్నారు. కార్యక్రమంలో పోర్టు అథారిటీ, ఎంపీఈ డీఏ, ఏపీఈడీఏ ఉన్నత అధికారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 99120 92222, 72077 51112 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.

వైసీపీ దుష్టపాలన బుగ్గి కావాలి

గుంటూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని వైసీపీ ప్రభుత్వ దుష్ట పాలనను భోగిమంటల్లో బుగ్గికావాలని టీడీపీ బీసీ సెల్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు కంచర్ల శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ సంక్రాంతి పండుగ తెలుగు ప్రజల జీవితాల్లో నూతన వెలుగులు నింపాలని కోరుకున్నారు. భోగీ, సంక్రాంతి, కనుమ పర్వదినాలు తెలుగు ప్రజల జీవితాల్లో సరికొత్త మార్పుకు నాంది పలకాలని ఆకాంక్షించారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధి కోసం తెలుగు ప్రజలు సమష్టిగా టీడీపీ- జనసేన కూటమిని బల పరిచి మద్దతు నివ్వాలని ఆయన కోరారు. ఈ సందర్భంగా ఆయన టీడీపీ, జనసేన అధినేతలు చంద్రబాబు, పవన్ కళ్యాణ్, యువనేత నారా లోకేష్, రాష్ట్ర అధ్యక్షుడు కింజరాపు అచ్చంనాయుడు, కొల్లు రవీంద్ర, గుంటూరు పశ్చిమ నియోజకవర్గ ఇన్‌చార్జి కోవెలమూడి రవీంద్ర (నాని), నగర ప్రజలకు సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు.

చంద్రబాబు ఫొటోని నేలకేసి కొట్టడంపై ఖండన



డాక్టర్ తోకల రాజవర్ధన్

తాడికొండ, జనవరి 13: తెలుగుదేశం పార్టీ అధినేత నారా చంద్రబాబునాయుడు చిత్ర పటాన్ని రాయపాటి రంగబాబు నేలకేసి కొట్ట డాన్ని తీవ్రంగా ఖండిస్తున్నామని తాడికొండ నియోజకవర్గ టీడీపీ నాయకులు డాక్టర్ తోకల రాజవర్ధన్ పేర్కొన్నారు. శనివారం ఆయన మా ట్లాడుతూ చంద్రబాబు, లోకేశ్‌పై రంగబాబు చేసిన ఆరోపణలను తప్పుపట్టారు. నీదగ్గర డబ్బు లు తీసుకునే స్థితిలో లోకేశ్ లేరన్నారు. చంద్ర బాబు, లోకేశ్‌పై ఇష్టం వచ్చినట్లు ఆరోపణలు చేస్తే ఒప్పుకునేది లేదన్నారు. పార్టీ గౌరవించ లేదని అంటున్న మిమ్మల్ని.. రాష్ట్ర విభజన సమయంలో కాంగ్రెస్ పార్టీ నిర్వీ ర్యం అయితే మీ రాజకీయ మనుగడ కోసం టీడీపీలోకి వచ్చారన్నారు. మిమ్మ ల్ని ఆదరించి రెండుసార్లు ఎంపీగా అవకాశం కల్పిందన్నారు. నీకు ఇష్టం లేకపోతే గౌరవంగా పార్టీ నుంచి అప్పుకొని నీకు ఇష్టమైన పార్టీలో చేరితే గౌరవంగా ఉంటుందన్నారు. 2019ఎన్నికల్లో ఓడిన లోకేశ్ మంగళగిరి నియో జకవర్గాన్ని వదిలిపెట్టకుండా ఎన్నో కార్యక్రమాలు చేపట్టారన్నారు.

18న మంగళగిరిలో బీసీ సంకల్ప సభ

మంగళగిరి సిటీ, జనవరి 13: బీసీ సంక్షేమ సంఘం పట్టణ, నియోజకవర్గ కమిటీల ఆధ్వర్యంలో ఈ నెల 18వ తేదీన మంగళగిరి బైపాస్ రోడ్డులో బీసీ సంకల్ప సభ పేరిట భారీ బహిరంగ సభ నిర్వహిస్తున్నట్టు సంఘం జిల్లా అధ్యక్షుడు పారేపల్లి మహేష్ తెలిపారు. మంగళగిరిలోని సంఘం రాష్ట్ర కార్యా లయంలో శనివారం ఆయన విలేకర్లకు వివరాలను వెల్లడించారు. ఎన్నికలు సమీపిస్తున్న తరుణంలో కొత్తగా ఓటు హక్కు పొందిన యువతకు దిశానిర్దే శం చేసి, రాజ్యాధికారం కోసం బీసీలు అవలంబించాల్సిన మార్గాలపై చర్చిం చేందుకు ఈ సభను ఏర్పాటు చేస్తున్నట్టు తెలిపారు. ఈ సమావేశంలో బీసీ సంక్షేమ సంఘం నియోజకవర్గ అధ్యక్షుడు వుడతా శ్రీనివాస్, పట్టణ అధ్యక్షుడు మంద్రు సత్యనారాయణ, కోఆర్డినేటర్ స్వాతి తదితరులు పాల్గొన్నారు.

కుర్చీలు నెత్తిన పెట్టుకుని నిరసన

మంగళగిరి సిటీ, జనవరి 13: అంగన్‌వాడీలు తమ సమస్యల పరిష్కారం కోసం చేస్తున్న నివరధిక సమ్మె శనివారం నాటికి 33వ రోజుకు చేరుకుంది. తాలూకా సెంటరులోని అంబేడ్కర్ విగ్రహం వద్ద ఏర్పాటు చేసిన సమ్మె శిబిం ంలో అంగన్‌వాడీలు కుర్చీలు నెత్తి మీద పెట్టుకుని నిరసనను తెలియజేశారు.

సీఐడీ కార్యాలయానికి చంద్రబాబు

● భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు

● పోలీసుల అడ్డగింతతో ఉద్రిక్తత ..



టీడీపీ శ్రేణులను అడ్డగిస్తున్న పోలీసులు

గుంటూరు, జనవరి13: మద్యంకేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, అప్పటి ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, శ్రీవాత్సవాలకు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరుచేసిన నేపథ్యంలో వారు శని వారం గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి వచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు వారు రూ.2లక్షల చొప్పున ష్యూరిటీలు అందజే శారు. చంద్రబాబు సీఐడీ కార్యాలయానికి వెళ్లే సమయంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. పోలీసులు తొలుత చంద్రబాబు వాహన కానాయిని మాత్రమే లోనికి వెళ్లనిచ్చేందుకు అనుమతించారు. అనం తరం చంద్రబాబు వాహనం వెనక వెళ్లేందుకు ప్రయత్నించిన పార్టీ నాయకులు కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు పార్టీ నేతలకు, కార్యకర్తలకు మధ్య తోపులాట, వాగ్వి వాదం ఏర్పడింది. దీంతో కార్యకర్తలు మరింత రెచ్చిపోయారు ప్రభు త్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేస్తూ సీఐడీ కార్యాలయంలోకి వెళ్లేం దుకు ప్రయత్నించగా పోలీసుల వారిని అడ్డుకున్నారు. సీఐడీ కార్యాల యంలోకి చంద్రబాబుతో పాటు ఆయనకు ష్యూరిటీలు సమర్పించేం దుకు వచ్చిన మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌తోపాటు న్యాయవాదులు పోసాని వెంకటే శ్వర్లు, మాగులూరి హరిబాబు, దొడ్డాల కోటేశ్వరరావు తదితరులను మాత్రమే అనుమతించారు. అనంతరం మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు విలేకరులతో మాట్లాడారు.

ప్రజల్లో పండుగ సంతోషం లేదు : కొల్లు రవీంద్ర

జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వ పానలో రాష్ట్రంలో ఏ వర్గం కూడా సంతోషంగా పండుగ చేసుకునే పరిస్థితి లేదని మాజీమంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో దురదృష్టకర పరిస్థి తులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. గతంలో పేదలు సంక్రాంతి చేసుకోవాలనే ఉద్దేశంతో చంద్రబాబు నెయ్యిసహా సంక్రాంతి కానుక ఇచ్చారన్నారు. నేడు వాటిజాడే లేదన్నారు.

చంద్రబాబుపై తప్పుడు కేసులు : మాజీ మంత్రి ఆలపాటి

ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన వైసీపీ ప్రభుత్వం అసత్య ప్రచారం, అబద్ధాలతో చంద్రబాబుపై అక్రమ కేసులను బనాయించిందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ధ్వజమె త్తారు. రింగ్ రోడ్డు లేకుండా చంద్రబాబుపై ఇన్నర్ రింగ్ రోడ్డులో అక్రమాలు జరిగాయని కేసు పెట్టడం విచిత్రంగా ఉందన్నారు. ఈ కేసుల్లో ఎటువంటి ఆధారాలు లేవని కోర్టులు స్పష్టం చేశాయన్నారు. కోర్టు వ్యాఖ్యలతోనైనా ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు.

నిర్బంధాలకు తలొగ్గం

● రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం చెబుతాం..

● హెచ్చరించిన అంగన్‌వాడీలు, హెల్పర్లు

● 33వ రోజుకు చేరిన నిరసన దీక్షలు

● పండుగ మూడు రోజులు ప్రత్యేక కార్యాచరణ



నిరసన దీక్షలో పాల్గొన్న అంగన్‌వాడీలు, హెల్పర్లు

గుంటూరు (తూర్పు), జనవరి13: అధికారుల బెదిరింపులకు తలొగ్గేది లేదని, తమపై నిర్బంధాలను ప్రయోగిస్తున్న ప్రభుత్వానికి రానున్న ఎన్నికల్లో తగిన గుణపాఠం తప్పక చెబుతామని అంగన్ వాడీలు, హెల్పర్లు హెచ్చరించారు. తమ న్యాయమైన డిమాండ్లును పరిష్కరించాలని కోరుతూ కలెక్టరేట్ ఎదుట అంగన్‌వాడీలు, హెల్పర్లు చేపట్టిన సమ్మె శనివారం నాటికి 33వ రోజుకు చేరుకుంది. విధుల్లో చేరాలని, చేరకపోతే ప్రత్యామ్నాయ ఏర్పాట్లు చేస్తామని ప్రభుత్వ పెద్దలు చెప్పడంపై అంగన్‌వాడీలు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా ప్రభుత్వానికి, ముఖ్యమంత్రికి వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. అనంతరం యూనియన్ జిల్లా నాయకులు దీప్తి మనోజ, రాధాలు మాట్లాడుతూ అంగన్‌వాడీలు ఎటువంటి పరిస్థితు ల్లోనూ భయపడేది లేదని, 'జగనన్నకు చెబుదాం' అనే కార్యక్రమం పేరుతో ఆదివారం నుంచి జిల్లాలో కోటి సంతకాలు కార్యక్రమం చేపడుతున్నట్టు వివరించారు. సమ్మెకు జనసేన నాయకులు ఆళ్లహరి, రెల్లి సంఘ నాయకులు సోమి ఉదయ్‌కుమార్ మద్దుతు తెలిపారు. రిలే దీక్షలలో డీ.వేదవతి, రిహినా, టీరాధా, శివకుమారి, హస్సేన్‌బి పాల్గొనగా, సమ్మెను సీఐటీయూ నేత కేశ్రీనివాస్, ముత్యాలరావు పర్య వేక్షించారు. అంతకుముందు పాతగుంటూరులో సీఐటీయూ కార్యాల యంలో అంగన్‌వాడీయూనియన్ జిల్లా అధ్యక్షురాలు ఏపీఎస్ కుమారి అధ్యక్షతన నిర్వహించిన జిల్లా విస్తృతస్థాయి సమావేశంలో భవిష్యత్తు కార్యచరణ ప్రకటించారు. ఇందులో భాగంగా భోగి పండుగ రోజున భోగి మంటల్లో జీవో నెం.2 కాపీలను దహనం చేయడం, సంక్రాంతి రోజున ఆటపాటతో ప్రభుత్వ నిరంకుశ విధానాలు ప్రజల్లోకి తీసుకు వెళ్లడం, కనుమరోజున సహపంక్తి భోజనాలు వంటి నిరసన కార్యమాలు చేపట్టనున్నట్లు యూనియన్ నేతలు తెలిపారు. సమావే శంలో సీఐటీయూ నేతలు దండా లక్ష్మీనారాయణ, వై.నేతాజీ, అంగన్ వాడీ నేతలు సుకన్య, రాధా, వెంకాయమ్మ తదితరులు పాల్గొన్నారు.

బీసీల సంక్షేమం టీడీపీతోనే సాధ్యం

నియోజకవర్గ ఇన్‌చార్జి బి.రామాంజనేయులు



సమావేశంలో మాట్లాడుతున్న టీడీపీ ఇన్‌చార్జి బీ రామాంజనేయులు

ప్రత్తిపాడు, జనవరి 13: బీసీల సంక్షేమం తెలుగుదేశం పార్టీతోనే సా ధ్యమని ప్రత్తిపాడు నియోజకవర్గ ఇన్‌చార్జి బీ రామాంజనేయులు అన్నా రు. మండల పరిధిలోని తిక్కిరెడ్డిపాలెం సీతారామస్వామి కల్యాణ మం డపంలో జయహో బీసీ మహా సభను నిర్వహించారు. ఈ సందర్భంగా జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో బీసీలకు అన్యా యం జరుగుతుందన్నారు. వైసీపీ ప్రభుత్వంలో బీసీలపై కేసులు కూడా పెరిగిపోయాయని ఇందుకోసం తెలుగుదేశం పార్టీ బీసీలకు రక్షణ చట్టా న్ని తీసుకువచ్చేందుకు మ్యానిఫెస్టోలో చేర్చిందన్నారు. ఈ కార్యక్రమంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వీరంకి గురుమూర్తి, గుంటూరు జిల్లా బీసీ సెల్ అధ్యక్షులు వేములకొండ శ్రీనివాసరావు, చంద్రశేఖర్ యాదవ్, ఈశ్వరరావు, పేరయ్య, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అసమ్మతి నాయకులను బుజ్జగించే పనిలో అధిష్ఠానం

● చిలువూరు, పెనుమూలి, పెదపాలెంలో చేరుతున్నట్లు ప్రచారం

● రంగంలోకి దిగిన ఎంపీ విజయసాయి

దుగ్గిరాల, జనవరి 13: మండలంలో అసమ్మతితో ఉన్న వైసీపీ నా యకులను బుజ్జగించేందుకు నేరుగా ఎంపీ విజయసాయిరెడ్డి రంగం లోకి దిగారు. మాజీ జడ్పీటీసీలు యేళ్ల జయలక్ష్మి, యడ్ల వెంకట్రావు, పెనుమూలి, పెదపాలెం, ఈమని మరికొన్ని గ్రామాలకు చెందిన నా యకులు, సీనియర్‌లు సైతం తమకు తగిన ప్రాధాన్యం లేదన్న కార ణంగా కొంతకాలంగా వైసీపీకి దూరంగా ఉంటూ వచ్చారు. మంగళ గిరి ఎమ్మెల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డితో సఖ్యత లేకనే దూరంగా ఉన్నారనే ప్రచారం జరిగింది. కాగా అధిష్ఠానం వైసీపీ ఇన్‌చార్జిగా చిరంజీవి ని ప్రకటించడం, ఎంటీఎంసీ వైసీపీ అధ్యక్షుడు వేమారెడ్డి వైసీపీ నూతన కార్యాలయాన్ని ప్రారంభించడం చకచకా జరిగిపోయాయి. దీంతో ఎమ్మె ల్యే ఆళ్ల రామకృష్ణారెడ్డి ఎమ్మెల్యే, వైసీపీ పదవులకు రాజీనామా చేశారు. జిల్లా సర్పంచుల సంఘ మాజీ అధ్యక్షురాలు, మాజీ జడ్పీటీసీ యేళ్ల జయలక్ష్మీ, పెదపాలెం సర్పంచ్ పాటిబండ్ల కృష్ణప్రసాద్, మరి కొందరు నాయకులను కలిసి పార్టీలో కొనసాగాలని కోరారు. కాగా బాబుకు మాటిచ్చాం నిర్ణయం మార్చుకోలేమని పెద్దాయన (యడ్ల వెంకట్రావు) తేల్చి చెప్పడంతో తిరిగి విషయాన్ని అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లారని ప్రచారం జరిగింది. జయలక్ష్మిసైతం మిగిలిన వారితో మా ట్లాడాలని మాట దాటవేశారని తెలుస్తోంది. ఇప్పటికే రేవేంద్రపాడు, పెదపాలెం, వీర్లపాలెంలకు చెందిన వైసీపీ సీనియర్ నాయకులు సం క్రాంతి తర్వాత వందలాది మంది కార్యకర్తలతో టీడీపీలో చేరేం దుకు సిద్ధమైనట్లు తెలియడంతోనే అధిష్ఠానమై అప్రమత్తమైందని, వైసీపీ వర్గాలు చెబుతున్నాయి. దీనికి గతంలో టీడీపీ నుంచి వైసీపీలో చేరిన నేతలందరూ, తిరిగి సొంతగూటికి వచ్చేందుకు కూడా పోతినేని వంటి నాయకులతో ఇప్పటికే కలిసి మాట్లాడారని ప్రచారం జరుగుతోంది.

మంగళగిరి, జనవరి 13: మంగళగిరి బైపాస్ రోడ్డులోని వైసీపీ ఎంటీఎంసీ నగర కార్యాలయానికి ఆ పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి, ఎంపీ విజయసాయిరెడ్డి శనివారం వచ్చారు. నియోజకవర్గానికి చెందిన పలువురు వైసీపీ నాయకులు ఆయన్ను కలిశారు.

ఎంపీఎల్ లీగ్ పోటీల్లో క్రీడాకారుల జోష్



మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్ అవార్డు అందజేస్తున్న టీడీపీ పోతినేని శ్రీనివాసరావు

మంగళగిరి సిటీ, జనవరి 13: టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకుని బోగి ఎస్టేట్స్‌లో నిర్వహిస్తున్న మంగళగిరి ప్రీమియర్ లీగ్-2 స్థానిక యువతలో సరికొత్త ఉత్సాహాన్ని నింపుతుంది. బ్యాటింగ్, బౌలింగ్‌లో క్రీడాకారులు సత్తా చాటుతున్నారు. శనివారం జరిగిన పోటీల్లో మచ్చ సీసీ జట్టుపై కేబీసీ యూత్, గ్లాడియే టర్స్ జట్టుపై రైజింగ్ స్టార్స్, పెరియార్ (ఉండవల్లి) జట్టుపై పార్కు రోడ్డు ఎలెవన్, భీమ్స్ జట్టుపై బాప్టిస్ట్ క్రికెట్ యూత్, సీకే మార్నింగ్ క్రికె ట్ ఫ్యామిలీ (మంగళగిరి టౌన్) జట్టుపై ఆంధ్రా బుల్లెట్స్ (ఈమని), ఎన్టీ ఆర్ జట్టుపై రైడర్స్ ఎలెవన్ జట్టు విజయాలను సాధించాయి. ప్రతి మ్యా చ్‌లో మ్యాన్ ఆఫ్ ది మ్యాచ్‌గా నిలిచిన క్రీడాకారుడికి తెలుగు యువత రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి జవ్వాది కిరణ్‌చంద్ సహకారంతో రూ.2 వేల నగదు బహుమతి, ట్రోఫీ, ప్రశంసాపత్రాలను అందజేశారు.

మన సంస్కృతీ సంప్రదాయాలను కాపాడుకోవాలి

● డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు

వట్టిచెరుకూరు, జనవరి 13: మన సంస్కృతిలో వ్యవసాయ రంగం ప్రధాన భూమిక పోషిస్తుందని, వ్యవసాయం వలె ఇతర రంగాలు మన సంస్కృతి సంప్రదాయంలో ఇమడలేకపోతున్నాయని రైతునేస్తం ఫౌండే షన్ ఛైర్మన్ డాక్టర్ యడ్లపల్లి వెంకటేశ్వరరావు అన్నారు. మండల పరిధి పుల్లడిగుంట సమీపంలోని రైతు నేస్తం ఫౌండేషన్ ప్రాంగణంలో శనివా రం సంక్రాంతి వేడుకలను వెంకటేశ్వరరావు నిర్వహించారు.

సమాజ చైతన్యానికి కళలు మూలం

● విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు



పొనుగుపాడులో రాష్ట్ర స్థాయి నాటిక పోటీల ప్రారంభ సభలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు

ఫిరంగిపురం, జనవరి 13 : సమాజాన్ని చైతన్య వంతం చేయటంలో కళల పాత్ర అమోఘమని విజయవాడ తూర్పు ఎమ్మెల్యే గద్దె రామ్మోహ నరావు అన్నారు. శుక్రవారం రాత్రి మండలంలోని పొనుగుపాడు గ్రామం లో అభినాయ నాటక పరిషత్ ఆధ్వర్యంలో రాష్ట్ర స్థాయి నాటికల పోటీల ప్రారంభ సభలో ఆయన మాట్లాడారు. స్వాతంత్ర్యం కోసం ఎంతో మంది కళాకారులు తమ జీవితాలను త్యాగం చేశారన్నారు. గుంటూరు పార్ల మెంట్ నియోజకవర్గ అధ్యక్షుడు తెనాలి శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ కళలు సమాజాన్ని మేల్కొలుపు తాయన్నారు. టీడీపీ పల్నాడు జిల్లా అధ్య క్షుడు జీవీ ఆంజనేయులు మాట్లాడుతూ కళల ద్వారా ప్రజలకు సమా జంలో జరిగే మార్పులు తెలియ జేస్తాయన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే గద్దె రామ్మోహనరావు, తెనాలి శ్రావణ్‌కుమార్, జీవీ ఆంజనేయు లుకు అభినయ శ్రీనివాస్ ఘనంగా సన్మానించారు. కార్యక్రమంలో డాక్టర్ గోనుగుంట్ల శ్రీనివాసరావు, రాష్ట్ర తెలుగు మహిళా అధికార ప్రతినిధి గద్దె లక్ష్మి, ఆడిటర్ జొన్నలగడ్డ శ్రీని వాసరావు, డాక్టర్ చిరుమామిళ్ళ నవీన్, సూర్యనారా యణ, రమణబాబు తదితరులు పాల్గొన్నారు.

పొనుగుపాడులో అభినయ కళా పరిషత్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న రాష్ట్ర స్థాయి నాటికల పోటీల్లో మొదటి నాటికగా శర్వాణి గ్రామీణ గిరిజన సాంస్కృతిక సేవా సంఘం శ్రీకాకుళం జిల్లా బోరివంక వారి కొత్త పరిమ ళం నాటికను ప్రదర్శించారు. రెండో నాటికగా అమ్మ మారిపోయింది నాటికను ప్రదర్శించారు.



సంక్రాంతి సంబరాల బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి రజిని, మేయర్, ఎమ్మెల్యేలు

నగరానికి సంక్రాంతి శోభ

● వైద్య ఆరోగ్య శాఖ మంత్రి విడదల రజిని

● జీఎంసీ సంక్రాంతి సంబరాల బ్రోచర్, గోడపత్రికల ఆవిష్కరణ

గుంటూరు (కార్పొరేషన్), జనవరి 13: సంక్రాంతి పండుగ క్రాంతిని గుంటూరు నగరానికి, నగర పాలక సంస్థ సంక్రాంతి సంబరాల ద్వారా తెచ్చిందని వైద్య ఆరోగ్యశాఖ మంత్రి విడదల రజిని అన్నారు. శని వారం లక్ష్మీపురం ఎన్టీఆర్ స్టేడియంలో గుంటూరు నగర పాలక సంస్థ ఆధ్వర్యంలో సంక్రాంతి సంబరాలను నిర్వహించనున్నారు. దీనికి సంబంధించిన బ్రోచర్, గోడప్రతులను మేయర్ కావటి శివనాగ మనో హర్ నాయుడు, ఎమ్మెల్యేలు మద్దాలి గిరిధర్, మహ్మద్ ముస్తఫా, అధికారులు, ప్రతినిధులతో కలిసి మంత్రి ఆవిష్కరించారు. నగర మేయర్ అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి మాట్లాడుతూ. గ్రామీణ ప్రాంతాలలో ఉండే సంక్రాంతి పండుగ శోభను నగర పాలక సంస్థ గుంటూరునగర ప్రజలకు చేరువ చేసిందన్నారు. కుల మతాలకు అతీతంగా నగరపాలక సంస్థ నిర్వహించే సంక్రాంతి సంబ రాల్లో కుటుంబ సమేతంగా ప్రజలంతా పాల్గొని ఆస్వాదించాలని ఆకాంక్షిస్తున్నా మన్నారు. మేయర్ మాట్లాడుతూ ఈ ఏడాది కూడా అన్ని వయస్సుల వారిని అలరించేలా వివిధ సాంస్కృతిక కార్యక్రమాలు చేపట్టనున్నామని తెలిపారు. ఎమ్మెల్యేలు మద్దాలి గిరిధర్, ముస్తఫాలు మాట్లాడుతూ, సంక్రాంతి పండగ సంబరాలను నగర పాలక సంస్థ నిర్వహించడం ఆనందంగా ఉందన్నారు.

ఆదివారం ఉదయం 7గంటల నుంచి సోమవారం సాయంత్రం 6 గంటల వరకు వివిధ రకాల సాంస్కృతిక కార్యక్రమాలను నిర్వహిస్తు న్నట్లు తెలిపారు. నగర ప్రజలు సంబరాలలో పాల్గొనాలని కోరారు. కార్యక్రమంలో డిప్యూటీ మేయర్ వనమా బాలవజ్రబాబు, వైసీపీ గుంటూరు తూర్పు నియోజకవర్గ సమన్వయకర్త షేక్ నూరి ఫాతిమా, డిప్యూటీ కమిషనర్ టీశ్రీనివాసరావు, ఎస్ఈ. సుందరరామిరెడ్డి, డీఈఈ. మహ్మద్ రఫిక్, వివిధ డివిజన్ల కార్పొరేటర్లు, అధికారులు, ప్రజా ప్రతినిధులు పలువురు పాల్గొన్నారు.

ప్రజానీకానికి సంక్రాంతి శుభాకాంక్షలు

● ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్



గుంటూరు, జనవరి 13: ప్రజలందరి జీవితాల్లో భోగభాగ్యాలు, సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆకాంక్షించారు. జిల్లాలో పని చేస్తున్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా ప్రజలందరికీ శనివారం ఆయన ఒక ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో నూతన క్రాంతులను, సంతోషాలను నింపాలని ఎస్పీ తెలిపారు. భోగి భోగభాగ్యాలను, సంక్రాంతి సుఖ సంతోషాలను, కనుమ కమ్మని కనువిందులను అందించాలని కోరుకు న్నారు. సంక్రాంతి పండుగను సుహృద్భావ వాతావరణంలో, తెలుగు సంస్కృతి సాంప్రదాయాల మేళ వింపుతో కుటుంబసభ్యులు, బంధుమిత్రుల నడుమ జరుపుకోవాలని సూచించారు. రైతులు పాడిపంటలతో ధన ధాన్యాలతో తులతూగాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆకాంక్షించారు.

పేదల కోసం పెట్టిన పార్టీ తెలుగుదేశం

● మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

● టీడీపీలో చేరిన 50 వైసీపీ ఎస్సీ కుటుంబాలు



వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారికి పార్టీ కండువాలు మెడలో వేసి ఆహ్వానిస్తున్న మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్

తుళ్ళూరు జనవరి 13: పేద, బడుగు బలహీన వర్గాల కోసం పెట్టిన పార్టీ తెలుగుదేశం పార్టీ అని మాజీ ఎమ్మెల్యే తెనాలి శ్రావణ్‌కుమార్ అన్నారు. బోరు పాలెం పెద్దలంకకు చెందిన వైస్సార్ కాంగ్రెస్ పార్టీ అమృతులూరు నాగరాజు, బిరుదగడ్డ మరియదాసు, ఫ్రాన్సిస్ తదితర 50ఎస్సీ కుటుంబాల వారు తెలుగుదేశం పార్టీలో చేరారు. శ్రావణ్ కుమార్ వారికి తెలుగుదేశం పార్టీ కండు వాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభ లో శ్రావణ్‌కుమార్ మాట్లాడుతూ పేదవానికి కూడు, గుడ్డ, నీడ ఉండాలనే సిద్ధాంతంతో ఆనాడు స్వర్గీయ ఎన్టీ రామారావు టీడీపీని స్థాపించారన్నారు. చంద్రబాబునాయుడు ఆయన సిద్ధాంతాలను మరింత మెరుగు పరిచి అమలు చేస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో టీడీపీ రాష్ట్ర కార్యదర్శి దామినేని శ్రీనివాస రావు, టీడీపీ తుళ్ళూరు మండల అధ్యక్షుడు ధనేకుల సుబ్బారావు, యువత అధ్యక్షుడు మూల్పూరి నరేష్, దొండ పాడు మాజీ ఎంపీటీసీ షైనేని గిరిజా, బోరుపాలెం, రాయపూడి, హరిశ్చంద్రపురం గ్రామాల టీడీపీ అధ్యక్షుడు కట్టా నరసంహరావు, మూల్పూరి శ్రీనివాసరావు, కొమ్మినేని కోటేశ్వరావు, దళిత జేఏసీ నేత గడ్డం మార్టిన్ , పెద్దలంక టీడీపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

నారా లోకేశ్ స్ఫూర్తితో సంక్రాంతి కానుకలు



సంక్రాంతి కానుక అందజేస్తున్న కాట్రగడ్డ మధు

తాడేపల్లి, జనవరి 13: తాడేపల్లి మండలం వడ్డేశ్వరం గ్రామం రాధా రంగా నగర్‌లో టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేశ్ స్ఫూర్తితో వడ్డేశ్వరం గ్రామ టీడీపీ సీనియర్ నాయకులు కాట్రగడ్డ మధుసూదనరావు సొంత నిధు లతో 200 కుటుంబాలకు పైగా శనివారం సంక్రాంతి కానులకను పంపిణీ చేసి సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. వచ్చే ఎన్నికల్లో ప్రజల అభివృద్ధికి పాటు పడే టీడీపీ జనసేన ప్రభుత్వానికి ప్రజలు అండగా నిలవాలని, ఆకాంక్షించారు. ఈ సందర్భంగా పలువురు స్థానికులు కాట్రగడ్డ మధు సేవా కార్యక్రమాల పట్ల అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో కాట్రగడ్డ మధుసూదనరావు, గ్రామ టీడీపీ అధ్యక్షులు ఈపూరి కోటయ్య, అబ్రహం, సుబ్రహ్మణ్యం, కామినేని సాంబశివరావు, మౌనిక, బాలాజీ, కోటయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి

ప్రత్తిపాడు, జనవరి 13: మండల పరిధిలోని పాతమల్లాయపాలెం వద్ద జ రిగిన రోడ్డు ప్రమాదంలో మహిళ మృతి చెందింది. ప్రత్తిపాడు పోలీసుల వివ రాల ప్రకారం పాతమల్లాయపాలెం గ్రామానికి చెందిన భీమవరపు వీరమ్మ (72) వైద్యశాలలో చూపించుకునేందుకు తన మనుమడు అయిన శ్రీనివాసరె డ్డి ద్విచక్రవాహనంపై గుంటూరు బయలు దేరింది. అయితే పాతమల్లాయపా లెం జడ్పీ పాఠశాల సమీపంలో ద్విచక్రవాహనానికి గేదెలు అడ్డు రావడంతో వాటిని తప్పించబోయి రోడ్డుపై పడిపోయారు. ఈ ప్రమాదంలో వీరమ్మ తల కు బలమైన గాయం కాగా వెంటనే ప్రత్తపాడు సామాజిక ఆరోగ్యకేంద్రంలో ప్రాథమిక చికిత్స చేయించి గుంటూరు జీజీహెచ్‌కు తరలించగా అక్కడ చికి త్స పొందుతూ శనివారం మరణించినట్లు ఎస్ఐ రవీంద్రబాబు తెలిపారు.

తెనాలి వార్తలు

◆ తెనాలి ◆ పొన్నూరు


కొండమూది సభలో పాల్గొన్న జనసేన నాయకులు

రాష్ట్ర భవిష్యత్తు కోసమే టీడీపీ-జనసేన పొత్తు

● జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు

పొన్నూరుటౌన్, జనవరి13: రాష్ట్ర భవిష్యత్తును దృష్టిలో ఉంచుకొని ఏర్పడిన టీడీపీ - జనసేన పొత్తుకు ప్రతి ఒక్కరు మద్దతు పలకాలన్ని జనసేన జిల్లా అధ్యక్షుడు గాదె వెంకటేశ్వరరావు కోరారు. మండల పరిధిలోని కొండమూది గ్రామంలో శనివారం జనసేన జెండా దిమ్మెను ఆయన ఆవిష్కరించారు. ఈ సందర్భంగా గ్రామానికి విచ్చేసిన జనసేన నాయకులకు ఘన స్వాగతం లభించింది. సభలో గాదె వెంకటేశ్వరరావు మాట్లాడుతూ వైసిపి పాలన మెడి పండులా ఉందన్నారు. జగన్‌రెడ్డి అధికారంలోకి వచ్చిన తర్వాత అన్ని వర్గాల ప్రజలు మోసానికి గురైయ్యారని ఆరోపించారు. టిడ్కో ఇళ్లను పంపిణీ చేయకుండా నిలిపివేసి పేదలకు స్వంత ఇంటి కల దూరం చేసారని ఆరోపించారు. రాష్ట్రమంతా ప్రచార ఆర్భాటంతో నా నమ్మకం నువ్వే జగన్ అన్ని బోర్డులు ఏర్పాటు చేసుకుంటున్నారని ఏద్దేవ చేసారు. సిట్టింగ్ ఎమ్మెల్యేను నమ్మకున్న మారుస్తున్న జగన్‌ను ప్రజలు ఎందుకు నమ్మాలని ప్రశ్నిస్తున్నారు. జగన్‌రెడ్డికి ప్రజల నమ్మకం లేదని గమనించే ఎమ్మెల్యేలను మారుస్తున్నారని ఎద్దేవ చేసారు. కార్యక్రమంలో జనసేన సమన్వయ కర్త వడ్రాణం మార్కేండేయ బాబు, బోని పార్వతి నాయుడు, రాయపాటి అరుణ తదితరులు పాల్గొన్నారు.

స్టేడియాన్ని అన్నివిధాలా తీర్చిదిద్దుతాం

● ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్

తెనాలిరూరల్, జనవరి 13: ప్రజలందరికీ ఉపయోగపడేలా తెనాలి ఏఎస్ఎన్ ఇండోర్ స్టేడియాన్ని తీర్చిదిద్దుతామని ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ అన్నారు. శనివారం ఇండోర్‌స్టేడియంలో నూతనంగా ఏర్పాటు చేసిన వాకింగ్ ట్రాక్ విద్యుత్ లైట్లను ఎమ్మెల్యే శివకుమార్ స్విచ్ ఆన్‌చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ స్టేడియంలో వాకింగ్ ట్రాక్ చుట్టూ విద్యుత్ లైట్లు లేకపోవడంతో సాయంత్ర వేళ వాకర్స్ తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని, వారికి సౌకర్యవంతంగా ఉండేలా వాకింగ్ ట్రాక్ చుట్టూ విద్యుత్ లైట్లు ఏర్పాటు చేశామన్నారు. ఇండోర్ స్టేడియాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకునేలా మరిన్ని సౌకర్యాలు కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇప్పటికే స్టేడియంలో వాలీబాల్ కోర్టు, హ్యాండ్‌బాల్ అకాడమి, వెయిట్‌లిఫ్టింగ్, యోగా, ఓపెన్‌జిమ్, టేబుల్‌టెన్నిస్, కరాటే వంటివి అందుబాటులోకి తీసుకురావడంతోపాటు మినరల్ వాటర్ సౌకర్యం కూడా ఏర్పాటు చేసినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో స్టేడియాన్ని మరింత అభివృద్ధిలోకి తీసుకురానున్నట్లు ఆయన స్పష్టం చేశారు. కార్యక్రమంలో 32వ వార్డు కౌన్సిలర్ సంధ్యారాణి, సునీల్, స్టేడియం అధికారులు, కోచ్‌లు పాల్గొన్నారు.


సభా స్థలానికి భూమి పూజ చేస్తున్న టీడీపీ నాయకులు

27న 'రా.. కదలి రా..' బహిరంగ సభ

చేబ్రోలు, జనవరి13: మండల పరిధిలోని వడ్లమూడి గ్రామంలో ఈ నెల 27న టీడీపీ ఆధ్వర్యంలో 'రా కదలిరా' బహిరంగ సభ నిర్వహించనున్నట్లు మండల టీడీపీ అధ్యక్షుడు మైల వెంకట రామరాజు తెలిపారు. ఈ సభకు టీడీపీ అధినేత నారా చంద్రబాబు నాయుడు ముఖ్య అతిథిగా పాల్గొంటున్నట్లు తెలిపారు. వడ్లమూడి గ్రామంలో క్వారీ బాల కోటేశ్వర స్వామి దేవస్థానం సమీపంలో బాణా ఫ్యాక్టరీ వెనుకన ఏర్పాటు చేసే సభా ప్రాంగణాన్ని శనివారం టీడీపీ నేతలు పరిశీలించి, భూమి పూజ చేసారు. కార్యక్రమంలో టీడీపీ నేతలు అనంత లక్ష్మీ నారాయణ, వీరంకి రంగారావు, మాజీ ఎంపిపి షేక్ ఖాదర్ బాషా, షేక్ ఇనై తుల్లా, కూరగాని గోవిందు, నత్తల రమేష్, బండ్లమూడి జ్యోతి బాబు, తోట శ్రీనివాసరావు, పాల్గొన్నారు.

అభివృద్ధి పనులు ప్రారంభం

చేబ్రోలు, జనవరి13: చేబ్రోలు జీబీసీ రోడ్డులో నూతనంగా నిర్మించిన సులభ కాంప్లెక్స్‌ను ఎమ్మెల్యే కిలారి వెంకట రోశయ్య తదితరులు శనివారం ప్రారంభించారు. అలాగే నూతనంగా నిర్మించబోయే కళ్యాణ మండపంకు శంఖుస్థాపం చేసారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు, కార్యకర్తలు, అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న నాటికల పోటీలు

పెదకాకాని, జనవరి 13: పెదకాకాని మండల పరిధిలోని తక్కెళ్ళపాడులో డాక్టర్ కాసరనేని సదాశివరావు నాటక కళా పరిషత్ 13వ జాతీయస్థాయి ఆహ్వాన నాటికల పోటీలు రెండో రోజు శనివారం కొనసాగాయి. ప్రదర్శనలో భాగంగా 'రైతే రాజు, అసత్యం' అనే నాటికలను ప్రదర్శించారు. కార్యక్రమంలో గ్రామస్తులతో పాటు సంగం డెయిరీ మాజీ చైర్మన్ కిలారి రాజన్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

భార్య కాపురానికి రాలేదని భర్త ఆత్మహత్య

తెనాలి, మారీసుపేట జనవరి 13: కట్టుకున్న భార్య తనను విడిచి పుట్టింటికి వెళ్లి తన వద్దకు రావడంలేదన్న మనస్థాపంతో భర్త ఆత్మహత్యకు పాల్పడిన ఘటనపై శనివారం కేసు నమోదు చేసినట్లు త్రీటౌన్ పోలీసులు తెలిపారు. త్రీ టౌన్ ఎఎస్ఐ ప్రసాదరావు తెలిపిన వివరాల ప్రకారం.. తెనాలి పాండురంగపేటకు చెందిన శివపార్వతికి చుండూరు మండలం వేటపాలెంకు చెందిన పొన్నాల సుబ్బారావుతో 13 ఏళ్ల క్రితం వివాహం జరిగింది. వీరికి ఇరువురు చిన్నారులున్నారు. వేడపాలెంలో కాపురం ఉటుండగా భార్య భర్తల మధ్య కొంతకాలంగా మనస్పర్ధలు చోటుచేసుకున్నాయి. ఇవి క్రమేపి పెరగడంతో భర్త సుబ్బారావును విడిచి తన పుట్టింటికి పిల్లలతో పాటు వచ్చింది. దీంతో భార్య, పిల్లలు లేకుండా ఉండలేని భర్త సుబ్బారావు పుట్టింటిలో ఉన్న భార్య వద్దకు వెళ్లాడు. తనతో పాటు వేటపాలెం రావాలని కలిసి జీవిద్దామని చెప్పాడు. దీంతో భార్య శివపార్వతి వేటపాలెంలో కాపురం చేయడానికి రానని, తెనాలిలో నివాసముండి ఏదో పనిచేసుకుని బతుకుదామని బదులిచ్చింది. దీంతో సొంత ఊరిని విడిచి తెనాలిలో వద్దంటూ భర్త ఆమెకు నచ్చచెప్పే ప్రయత్నం చేయగా ఇద్దరి మధ్య వాదోపవాదాలు చోటుచేసుకున్నాయి. భార్య, బిడ్డలు తనకు దూరమవుతారని మనస్థాపంతో అత్తగారింట్లోనే శుక్రవారం రాత్రి సుబ్బారావు ఉరివేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. గమనించిన కుటుంబ సభ్యులు అతడిని ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా అప్పటికే సుబ్బారావు మృతిచెందాడని వైద్యులు ధృవీకరించారు. దీనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఏఎస్ఐ వెల్లడించారు.

మా ప్రయాణం తెలుగుదేశంతోనే..

● రాయపాటి సాంబశివరావు, శ్రీనివాసరావు

గుంటూరు, జనవరి 13(ఆంధ్రజ్యోతి): 'మా ప్రయణం తెలుగుదేశం పార్టీతోనే ఉంటుందని మాజీ ఎంపీ రాయపాటి సాంబశివరావు, మాజీ ఎమ్మెల్సీ రాయపాటి శ్రీనివాసరావులు తేల్చి చెప్పారు. రాయపాటి సాంబశివరావు కుమారుడు రంగారావు టీడీపీకి రాజీనామా నేపథ్యంలో జరిగిన పరిణామాలపై 'ఆంధ్రజ్యోతి' శనివారం రాయపాటి సోదరులను సంప్రదించింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ. రంగారావుది వ్యక్తిగత నిర్ణయం, ఆయన నిర్ణయంతో తమకు ఎలాంటి సంబంధం లేదని స్పష్టం చేశారు. తాము టీడీపీలో చేరిన నాటి నుంచి చంద్రబాబు వెంటే వున్నామని, ఇక ముందు కూడా చంద్రబాబుతోనే నడుస్తామని అన్నారు. ఎట్టి పరిస్థితుల్లో టీడీపీ, చంద్రబాబును వీడేది లేదని తెలిపారు. వయోభారం రీత్యా పార్టీ కార్యక్రమాల్లో భాగస్వామ్యం కావడంలో తాము కాస్త నెమ్మదించామే తప్ప, తమ కుటుంబ సభ్యులందరూ పార్టీతోనే నడుస్తున్నారని చెప్పారు. ఇకపై తమ ప్రయాణం తెలుగుదేశంతోనే ఉంటుందని స్పష్టం చేశారు.

రాయపాటి కుటుంబం ఎప్పటికీ టీడీపీతోనే: రాయపాటి శైలజ

రాయపాటి కుటుంబం ఎప్పటికీ టీడీపీతోనే ఉంటుందని, టీడీపీని వీడిపోతుందనే ప్రచారంలో ఎంతమాత్రం వాస్తవం లేదని అమరావతి జేఏసీ మహిళానేత, రాయపాటి సోదరుడి కుమార్తె రాయపాటి శైలజ స్పష్టంచేశారు. రాయపాటి రంగారావు రాజీనామా అనేది ఆయన వ్యక్తిగత నిర్ణయమని, దానికి తమ కుటుంబ సభ్యుల మద్దతు లేదని, ఆమె ఓ వీడియోలో స్పష్టం చేశారు. రంగారావు చర్యలు, మాటలకు తమకు ఎలాంటి సంబంధలేదని అన్నారు. 2014లో కాంగ్రెస్‌ను వీడి టీడీపీలోకి వచ్చిననాటి నుంచి ఇప్పటి వరకూ టీడీపీతోనే నడుస్తున్నామని, ఇకముందు నడుస్తామని, త్వరలో కుటుంబ సమేతంగా మీడియా ముందుకు వచ్చి ఈ విషయాన్ని స్పష్టం చేస్తామని రాయపాటి శైలజ తెలియజేశారు.

తెనాలిలో టీడీపీ జెండా ఎగురవేద్దాం


పాదయాత్రగా వస్తున్న ఆలపాటి రాజేంద్రప్రసాద్, టీడీపీ, జనసేన శ్రేణులు

● మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్
● ముగిసిన తొలివిడత ప్రజాయాత్ర
● ప్రజలకు భరోసా కల్పిస్తూ 60కిలోమీటర్లు పూర్తి
● సంక్రాంతి పండుగ అనంతరం పాదయాత్ర పునఃప్రారంభం

తెనాలి రూరల్, జనవరి 13: రానున్న ఎన్నికల్లో జెండాను తెనాలి నియోజకవర్గంలో ఎగురవేద్దామని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్ర ప్రసాద్ పిలుపునిచ్చారు. ప్రజాయాత్ర పేరిట మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ తలపెట్టిన పాదయాత్ర శనివారం కొలకలూరు ఖాజీపేట నుండి ప్రారంభమై జాకీర్ హుస్సేన్ నగర్‌తో ముగిసింది. తొలివిడత దాదాపుగా 60.8 కిలోమీటర్లు పాదయాత్ర చేశారు. ఆయన పర్యటించిన గ్రామాల్లో టీడీపీ,జనసేన సంయుక్తంగా విడుదల చేసిన ఎన్నికల మినిమేనిఫెస్టోను ప్రజలకు వివరిస్తూ చంద్రబాబు, పవన్ కల్యాణ్‌ల నాయకత్వాన్ని గెలిపించుకోవాలని కోరారు. వైసీపీ జగన్ ప్రభుత్వం సంక్షేమం పేరుతో ప్రజలపై అనేక రకాలుగా పన్నులు, నిత్యవసరాల ధరలు వంటివి పెంచి ఒకచేత్తో ఇస్తూ నాలుగుచేతులతో లాగేస్తుందని ప్రజలకు వివరించారు. అన్నదాతలకు గతంలో ఎన్నడూ లేని విధంగా ఈ ప్రభుత్వం నిర్లక్ష్యం చేసిందని ఇదే ప్రభుత్వం పాలన మరి కొన్ని ఏళ్లు సాగితే రైతు అనేవాడిని మ్యూజియాల్లో చూడాల్సి వస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. రాష్ట్రం బాగుండాలంటే మోసపూరిత మాటలతో కడుపునింపే వైసీపీ ప్రభుత్వాన్ని తరమికొట్టి అభివృద్ధికి బాటలు వేసే తెలుగుదేశం,జనసేనలను గెలిపించుకుందామన్నారు. పాదయాత్రగా వస్తున్న ఆలపాటికి పలువురు రైతులు సంఘీభావం తెలిపి పంటల సాగుకు నీరందించని తీరును, కాలువలు పూడికలు తీయకపోవడంతో తుఫాను ప్రభావంతో నీరు పంటలలో చేరి నష్టం జరిగిన తీరును చెప్పి ఆవేదనకు గురయ్యారు. రానున్నది మన ప్రభుత్వమేనని తప్పకుండా రైతులకు మంచి చేసి అన్నపూర్ణగా ఆంధ్రప్రదేశ్‌ను తీర్చిదిద్దుతామని ఆలపాటి వారికి హామి ఇచ్చారు. దారి పొడవునా ప్రభుత్వ వైఫల్యాలను వివరిస్తూ ప్రజలకు భవిష్యత్తుకు గ్యారెంటీ కల్పిస్తూ మాజీ ముఖ్యమంత్రి నారాచంద్రబాబునాయుడు ప్రవేశపెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించి చైతన్యవంతులను చేశారు.తొలుత కొలకలూరులోని వెంకటేశ్వరస్వామివారి ఆలయంలో ప్రత్యేక పూజలు జరిపి పాదయాత్ర ప్రారంభించారు. కార్యక్రమంలో పట్టణ, మండల టీడీపీ అధ్యక్షులు తాడిబోయిన హరిప్రసాద్, కేసన కోటేశ్వరరావు, తోట లక్ష్మయ్య, జనసేన పార్టీ తోట నరేంద్రకుమార్, ఇరుపార్టీల నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యల పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి జగన్ ప్యాలెస్ ముట్టడిస్తాం

● రాష్ట్ర ఐద్వా ప్రధాన కార్యదర్శి రమాదేవి
● 33వ రోజుకు అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్ల ఆందోళన
● వివిధ ప్రాంతాల్లో షోకాజ్ నోటీసు పత్రాలు దహనం


అంగన్‌వాడీలను ఉద్దేశించి ప్రసంగిస్తున్న దీరమాదేవి

పెదకాకాని, జనవరి 13: కోటి సంతకాలతో సీఎం ప్యాలస్‌ను ముట్టడిస్తామని ఐద్వా రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రమాదేవి హెచ్చరించారు. శనివారం మండల కేంద్రమైన పెదకాకానిసెంటర్లో అంగన్వాడీ వర్కర్లు, హెల్పర్స్ యూనియన్ చేస్తున్న సమ్మె 33వరోజుకు చేరుకుంది. సమ్మెశిబిరాన్ని సందర్శించి మద్దతు తెలిపిన అనంతరం రమాదేవి మాట్లాడుతూ.. అంగన్వాడీల చేత వెట్టిచాకిరి చేయించుకుంటూ వారికి కనీసవేతనాలు ఇవ్వడంలేదని, ప్రభుత్వం అంగన్వాడీలపట్ల చిన్నచూపు చూస్తుందని మండిపడ్డారు. అధికారంలోకి రాగానే తెలంగాణ కంటే అదనంగా రూ.1000 జీతం చెల్లిస్తానని ఎన్నికల ముందు వాగ్దానం చేసిన జగన్మోహన్ రెడ్డి తీరా గెలిచాక మోసం చేశారని ధ్వజమెత్తారు. అంగన్వాడీలకు కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. గ్రాట్యూటిపై తక్షణమే సుప్రీంకోర్టు తీర్పును అమలుచేయాలని, మినీ సెంటర్లను, ప్రధాన కేంద్రాలుగా మార్చాలని రిటైర్డ్‌మెంట్ బెనిఫిట్ రూ.5 లక్షల పెంచాలని, పెండింగ్‌లో ఉన్న బిల్లులు, ఇతర బకాయలను వెంటనే చెల్లించాలన్నారు. అనంతరం కోటి సంతకాల కార్యక్రమాన్ని ప్రారంభించారు. కార్యక్రమంలో సీఐటీయూ జిల్లా కార్యదర్శి నన్నపినేని శివాజీ, అంగన్వాడీ వర్కర్స్, హెల్పర్స్ తదితరులు పాల్గొన్నారు.

కొల్లిపర : మండల కేంద్రం కొల్లిపరలో అంగన్‌వాడీలు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నిరసన వ్యక్తంచేశారు. సీఐటీయూ మండల అధ్యక్షుడు కోటా చంద్రశేఖర్ ఆందోళనకు మద్దతు తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ యూనియన్ నేతలు నిర్మలజ్యోతి, సీతమ్మ, డీ.శివపార్వతీ, ఆదిలక్ష్మి, సంతోషకుమారి, దీప్తి, శ్రీలక్ష్మి, సువర్ణలత, మాధవీలత తదితరులు పాల్గొన్నారు.

పొన్నూరుటౌన్: పట్టణంలో అంగన్‌వాడీలు చేపట్టిన రిలే నిరాహార దీక్షలకు శనివారం సీఐటీయూ నేతలు సంఘీభావం తెలిపారు. ఈ సందర్భంగా సీఐటీయూ నేత నిమ్మకూరి రమేష్ బాబు మాట్లాడుతూ అంగన్‌వాడీల న్యాయబధమైన కోరికలు తీర్చకుండా షోకాజ్ నోటీసులు జారీ చేయటం సరికాదన్నారు. షోకాజ్ నోటీసుల పత్రాలను అంగన్‌వాడీలు దహనం చేశారు. కార్యక్రమంలో సీఐటీయూ, అంగన్‌వాడీ యూనియన్ నేతలు పాల్గొన్నారు.


పుటీ బలప్రదర్శన పోటీల్లో పాల్గొన్న ఎమ్మెల్యే శివకుమార్

ఒంగోలు జాతి ఎడ్ల పోటీలు ప్రారంభం

కొల్లిపర, జనవరి 13 : సంక్రాంతి పండుగ సందర్భంగా మండల కేంద్రం కొల్లిపరలో జాతీయ స్థాయిలో నిర్వహిస్తున్న ఒంగోలు జాతి వృషభరాజముల పుటీ బల ప్రదర్శన పోటీలను శనివారం ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా శివకుమార్ మాట్లాడుతూ మన దేశంలో ఒంగోలు జాతి పశువులు కనుమరుగయ్యే పరిస్థితి ఏర్పడిందన్నారు. గ్రామీణ ప్రాంతాల్లో ఒంగోలు జాతి వృషభరాజముల పుటీ బల ప్రదర్శన పోటీలను ఏర్పాటు చేయడం వలన రైతులు ఒంగోలు జాతి ఎడ్ల పోషణ, సంరక్షణకు చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందన్నారు. కార్యక్రమంలో వైసీపీ కన్వీనర్ అవుతు పోతిరెడ్డి, సొసైటీ అధ్యక్షుడు ఈమని హరికోటిరెడ్డి, వైసీపీ యూత్ కన్వీనర్ ఈదా యశ్వంత్‌రెడ్డి, వైసీపీ నాయకులు ఆరిగ చంద్రశేఖర్‌రెడ్డి, రామిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

పెదకాకాని శివాలయంలో

గుర్తుతెలియని వ్యక్తి మృతి


గుర్తు తెలియని వ్యక్తి మృతదేహం

పెదకాకాని, జనవరి 13: పెదకాకాని శివాలయ ప్రాంగణంలో గుర్తుతెలియని వ్యక్తి మృతి చెందిన సంఘటన శనివారం వెలుగు చూసింది. ఆలయ ప్రాంగణంలోని శౌరశాల వద్ద సుమారు 55 ఏళ్ల వయస్సు గల వ్యక్తి గత రాత్రి మృతిచెందాడు. స్థానికులు పెదకాకాని పోలీసుస్టేషన్‌కు సమాచారం అందించగా పోలీసులు ఆలయానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం గుంటూరు జీజీహెచ్‌లోని మార్చురీ తరలించారు. మృతు డు బ్లూప్యాంటు, గళ్ళ చొక్కా ధరించి ఉన్నాడు. సమాచారం తెలిసిన వారు పెదకాకాని పోలీసుస్టేషన్‌ను సంప్రదించాలని పోలీసులు తెలిపారు. ఆలయ ప్రాంగణంలో వ్యక్తి మృతిచెందటంతో ఆలయాన్ని మూసివేసి, సంప్రోక్షణ అనంతరం ఉదయం 9:30 గంటలకు ఆలయాన్ని యథావిధిగా తెరిచారు.


ఆర్థికసాయం అందచేస్తున్న టీడీపీ నాయకులు

వైద్య ఖర్చులకు ఆర్థికసాయం

పొన్నూరుటౌన్, జనవరి13: పట్టణంలోని 25వ వార్డుకు చెందిన షేక్ అలీమా కుమార్తె వైద్యానికి శనివారం టీడీపీ నాయకులు రూ. 20 వేల ఆర్థికసాయం అందించారు. అనారోగ్యంతో బాధపడుతున్న అలీమా కుమార్తె విషయం తెలుసుకుని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ ఆదేశాలతో ఈ నగదు సాయాన్ని అందించామని టీడీపీ నేతలు తెలిపారు. కార్యక్రమంలో పట్టణ టీడీపీ అధ్యక్షుడు పఠాన్ అహ్మద్ ఖాన్, నియోజకవర్గ మైనార్టీ సెల్ అధ్యక్షుడు ఫైరోజ్ ఖాన్, జాబిబుల్లా, అబ్దుల్ రహీం, సిలార్ బాషా, కరిముల్లా బాజీ, జానీ బేగ్, మహ్మద్ గౌస్, సుభాని, డొక్క రమాదేవి, రఫీ ఖాన్, ఇస్మాయిల్ తదితరులు పాల్గొన్నారు.

కొనసాగుతున్న అన్న క్యాంటీన్ సేవలు

తెనాలి, మారీసుపేట జనవరి 13: స్థానిక శివాజిచౌక్ లోని అన్న క్యాంటీన్‌లో శనివారం మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్, మాధవీలత దంపతుల సహకారంతో, మార్కెట్ సెంటర్‌లోని అన్న క్యాంటీన్‌లో ఎన్నారై విద్యాసంస్థల సహకారంతో పేదలకు ఆహారం పంపిణీ చేశారు. కార్యక్రమంలో మాదల కోటేశ్వరరావు, క్రొత్తపల్లి రమేష్, సాంబశివరావు, రమేష్, తదితరులు పాల్గొన్నారు.

20న సాయినాధుని

సత్సంగ కేంద్ర వార్షికోత్సవం

తెనాలి అర్బన్,జనవరి 13 : సద్గురు సాయినాధుని సత్సంగ కేంద్ర వార్షికోత్సవం ఈనెల 20న జరుగుతుందని నిర్వాహకులు నాగ భూషణరెడ్డి శనివారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. బుర్రిపాలెం రోడ్డులోని టీజీకె కళ్యాణ మండపంలో రెండు రోజుల పాటు జరిగే ఈ కార్యక్రమాల్లో భక్తులు పాల్గొనాలని కోరారు. 20న గరుడ వాహనంలో స్వామివారి ఉత్సవమూర్తుల ఊరేగింపు, పుష్పధామం నిర్వహిస్తామన్నారు. 21న సాయిపారాయణ, నృత్యగీతిక, మధ్యాహ్న హారతి, కూచిపూడి నాట్యం, సాయితత్త్వంపై ప్రవచనం అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహిస్తామన్నారు.

గాలిపటాల ఎగురవేతలో అప్రమత్తం

తెనాలి అర్బన్, జనవరి 13 : సంక్రాంతి పండుగ నేపథ్యంలో యువత గాలిపటాలు ఎగురవేసే సందర్భంలో తగిన జాగ్రత్తలు తీసుకోవాలని విద్యుత్ డీఈ అశోక్‌కుమార్ సూచించారు. విద్యుత్ లైన్ల వద్ద గాలిపటాలు ఎగుర వేయకుండా ఉండాలని అన్నారు. అలాగే గాలిపటాల దారం విద్యుత్ లైన్లు, ట్రాన్స్‌ఫార్మర్లపై పడి ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున తగిన జాగ్రత్తలు తీసుకోవాలని కోరారు. విద్యుత్ తీగకు చుట్టుకుపోయిన పతంగులను, దారాలను వాటినుంచి తీసేప్రయత్నాలు చేయవద్దని హెచ్చరించారు.

బాధిత కుటుంబానికి ఎమ్మెల్యే పరామర్శ

తెనాలి అర్బన్, జనవరి 13 : గంగానమ్మపేటలో ఇటీవల మృతి చెందిన మార్కెట్‌యార్డు మాజీ చైర్మన్ గడవర్తి సుబ్బయ్య కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అన్నాబత్తుని శివకుమార్ శనివారం పరామర్శించారు. ఆయన మృతి పట్ల తమ ప్రగాఢ సానుభూతి తెలిపారు. సుబ్బయ్య చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఎమ్మెల్యేతో పాటు పలువురు వైసీపీ నేతలు ఉన్నారు.

పోలీసుల అదుపులో జూదరులు

తెనాలి రూరల్, జనవరి 13: పేకాట శిబిరంపై దాడులు నిర్వహించి పలువురి జూదరులను అదుపులోకి తీసుకున్నట్లు రూరల్ ఎస్ఐ చిరుమామిళ్ల వెంకటేశ్వర్లు తెలిపారు. మండలంలోని తేలప్రోలు శివారులో శనివారం ఓ డంపింగ్ యార్డు వద్ద కోతముక్క ఆడుతున్నారన్న సమాచారంతో దాడులు నిర్వహించామన్నారు. ఈ దాడుల్లో ఏడుగురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి నగదు, మూడు ద్విచక్రవాహనాలను స్వాధీనంచేసుకొని సీజ్ చేసి, కేసు నమోదు చేసినట్లు తెలిపారు. చట్ట వ్యతిరేక చర్యలకు పాల్పడితే కఠిన చర్యలు తప్పవని ఎస్ఐ హెచ్చరించారు.

జాతీయ టాంగ్‌సూడోలో

తెనాలి క్రీడాకారుల ప్రతిభ

తెనాలి అర్బన్, జనవరి 13 : జాతీయ స్థాయిలో జరిగిన టాంగ్ సూడో చాంపియన్‌షిప్ పోటీల్లో తెనాలి క్రీడాకారులు ప్రతిభ కనబరిచారు. ఈనెల 4 నుంచి 6 వరకు ఢిల్లీలో ఛత్రసాల్ స్టేడియంలో పోటీలు జరిగాయి. ఆరాధ్యుల చరణ్, షేక్ తల్సీన్‌బాషా, బెన్నీ రాజశేఖర్ రజిత పతకం సాధించగా, సత్యజశ్వంత్, జ్ఞానతేజ్‌లు కాంస్య పతకాలు పొందారు. శనివారం స్థానిక కేఎస్ఆర్ తైక్వాండో అకాడమీలో పతకాలు పొందిన క్రీడాకారులకు అభినందన కార్యక్రమం నిర్వహించారు. కే.వెంకటేశ్వరరావు, మద్దాళి శేషాచలం, కొత్త రామారావు, కోచ్ శ్రీనివాసరావులు క్రీడాకారులను అభినందించారు.



పతకాలు సాధించిన వారితో కోచ్ శ్రీనివాసరావు, శేషాచలం


నరేంద్ర కుమార్ సమక్షంలో టీడీపీలో చేరిన రజిని కుమార్ తదితరులు

దుష్టపాలనకు చరమగీతం పాడుదాం

● మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్
● టీడీపీలో చేరిన వైసీపీ ముఖ్య నేతలు

పొన్నూరుటౌన్, జనవరి13: రాష్ట్రంలో నాలుగున్నర ఏళ్లుగా సాగుతున్న వైసీపీ అరాచక దుష్ట పాలనకు చరమగీతం పాడేందుకు ప్రజలంతా సిద్ధంగా ఉన్నారని మాజీ ఎమ్మెల్యే, సంగం డెయిరీ చైర్మన్ ధూళిపాళ్ళ నరేంద్ర కుమార్ అన్నారు. పొన్నూరు పట్టణ, మండలానికి చెందిన పలువురు కీలక వైసీపీ నాయకులు శనివారం నరేంద్ర కుమార్ సమక్షంలో టీడీపీలో చేరారు. ముందుగా వారు నిడుబ్రోలు గోగినేని రజనీకుమార్ ఇంటి వద్ద నుంచి పట్టణంలో భారీ ద్విచక్రవాహన ర్యాలీ నిర్వహించారు. అనంతరం పట్టణంలోని డాక్టర్ బీఆర్ అంబేద్కర్, ఎన్టీఆర్, వీరయ్య చౌదరి విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళులు అర్పించారు. చింతలపూడి గ్రామం వరకు ద్విచక్రవాహన ర్యాలీ సాగింది. వైసీపీ నాయకులు గోగినేని రజిని కుమార్, చెన్నుపాటి శ్రీనివాసరావు, నక్కల ప్రసాద్, తూమాటి రమేష్, వరికూటి వెంకట నరసింహారావు, కొర్నెపాటి నాగేశ్వరరావు, గోగినేని సుభాష్, గోగినేని గోపి కృష్ణ, నిడుబ్రోలు గోపి కృష్ణ, గౌడ ఉదయ్, భక్తుల శశిదర్, భక్తుల మణికంఠ, పాలపర్తి రాంబాబు, మోపర్తి చెంచు, మున్నంటి నాగేశ్వరరావు, నాగరాజు, షేక్ షబీర్, అజయ్, ప్రణీత తదితరులను పార్టీ కండువాలు కప్పి సాదరంగా ఆహ్వానించారు. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన సభలో నరేంద్ర కుమార్ మాట్లాడుతున్న వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలు నిర్వీర్యం చేసిందని, ముఖ్యంగా పోలీసు వ్యవస్థను తన ఇష్టారీతిన ఉపయోగించుకొని ప్రజలపై, టీడీపీ నేతలపై తీవ్ర నిర్బంధాన్ని మోపిందన్నారు. వైసీపీ నేతలు వారిని ప్రశ్నించటానికి ప్రయత్నించిన ప్రతి ఒక్కరి గొంతు నొక్కాలని చూశారన్నారు. పొన్నూరులోనూ వైసీపీ నేతల దౌర్జన్యాలు మితిమిరిపోయ్యాన్నారు. ఈ పరిస్థితులను అధిగమించాలంటే రానున్న రోజుల్లో టీడీపీ, జనసేన ప్రభుత్వం ఏర్పడాల్సిన ఆవశ్యత ఎంతైనా ఉందన్నారు. ప్రజలు విజ్ఞతతో ఆలోచించి వైసీపీ ప్రభుత్వ అరాచక పాలనకు చరమగీతం పాడాలని, టీడీపీ జనసేన కూటమికి మద్దతు పలకాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టీడీపీలో చేరిన గోగినేని రజిని కుమార్ మిత్ర బృందాన్ని నరేంద్ర కుమార్ ప్రత్యేకంగా అభినందించారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.


టీడీపీ శ్రేణులను అడ్డగిస్తున్న పోలీసులు

సీఐడీ కార్యాలయానికి చంద్రబాబు

● భారీగా తరలివచ్చిన టీడీపీ శ్రేణులు ● పోలీసుల అడ్డగింతతో ఉద్రిక్తత

గుంటూరు, జనవరి13: మద్యంకేసులో టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడు, అప్పటి ఎక్సైజ్ మంత్రి కొల్లు రవీంద్ర, శ్రీవాత్సవాలకు ఏపీ హైకోర్టు ముందస్తు బెయిల్ మంజూరుచేసిన నేపథ్యంలో వారు శని వారం గుంటూరులోని సీఐడీ ప్రాంతీయ కార్యాలయానికి వచ్చారు. కోర్టు ఆదేశాల మేరకు వారు రూ.2లక్షల చొప్పున ష్యూరిటీలు అందజే శారు. చంద్రబాబు సీఐడీ కార్యాలయానికి వెళ్లే సమయంలో అక్కడ ఉద్రిక్త పరిస్థితి తలెత్తింది. పోలీసులు తొలుత చంద్రబాబు వాహన కానాయిని మాత్రమే లోనికి వెళ్లనిచ్చేందుకు అనుమతించారు. అనం తరం చంద్రబాబు వాహనం వెనక వెళ్లేందుకు ప్రయత్నించిన పార్టీ నాయకులు కార్యకర్తలను పోలీసులు అడ్డుకున్నారు. ఈ సందర్భంగా పోలీసులకు పార్టీ నేతలకు, కార్యకర్తలకు మధ్య తోపులాట, వాగ్వివాదం ఏర్పడింది. దీంతో కార్యకర్తలు మరింత రెచ్చిపోయారు ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలుచేస్తూ సీఐడీ కార్యాలయంలోకి వెళ్లేందుకు ప్రయత్నించగా పోలీసుల వారిని అడ్డుకున్నారు. సీఐడీ కార్యాల యంలోకి చంద్రబాబుతో పాటు ఆయనకు ష్యూరిటీలు సమర్పించేందుకు వచ్చిన మాజీ మంత్రి నక్కా ఆనందబాబు, మాజీ ఎమ్మెల్యే ధూళిపాళ్ల నరేంద్రకుమార్‌తోపాటు న్యాయవాదులు పోసాని వెంకటే శ్వర్లు, మాగులూరి హరిబాబు, దొడ్డాల కోటేశ్వరరావు తదితరులను మాత్రమే అనుమతించారు. అనంతరం మాజీ మంత్రులు కొల్లు రవీంద్ర, ఆలపాటి రాజేంద్రప్రసాద్‌లు విలేకరులతో మాట్లాడారు.

ప్రజల్లో పండుగ సంతోషం లేదు : కొల్లు రవీంద్ర


జగన్ నేతృత్వంలోని వైసీపీ ప్రభుత్వ పానలో రాష్ట్రంలో ఏ వర్గం కూడా సంతోషంగా పండుగ చేసుకునే పరిస్థితి లేదని మాజీమంత్రి కొల్లు రవీంద్ర తెలిపారు. ప్రస్తుతం రాష్ట్రంలో దురదృష్టకర పరిస్థి తులు నెలకొన్నాయని ఆందోళన వ్యక్తంచేశారు. గతంలో పేదలు సంక్రాంతి చేసుకోవాలనే ఉద్దేశంతో చంద్రబాబు నెయ్యిసహా సంక్రాంతి కానుక ఇచ్చారన్నారు. నేడు వాటిజాడే లేదన్నారు.

చంద్రబాబుపై తప్పుడు కేసులు : మాజీ మంత్రి ఆలపాటి

ప్రజలను మభ్యపెట్టి అధికారంలోకి వచ్చిన వైసీపీ అసత్య ప్రచారం, అబద్ధాలతో చంద్రబాబుపై అక్రమ కేసులను బనాయించిందని మాజీ మంత్రి ఆలపాటి రాజేంద్రప్రసాద్ ధ్వజమె త్తారు. రింగ్‌రోడ్డు లేకుండా చంద్రబాబుపై ఇన్నర్ రింగ్ రోడ్డులో అక్రమాలు జరిగాయని కేసు పెట్టడం విచిత్రంగా ఉందన్నారు. ఈ కేసుల్లో ఎటువంటి ఆధారాలు లేవని కోర్టులు స్పష్టం చేశాయన్నారు. కోర్టు వ్యాఖ్యలతోనైనా ప్రభుత్వం సిగ్గుపడాలన్నారు.

ప్రజానీకానికి సంక్రాంతి శుభాకాంక్షలు

● ఎస్పీ ఆరిఫ్‌హఫీజ్



గుంటూరు, జనవరి 13: ప్రజలందరి జీవితాల్లో భోగభాగ్యాలు, సుఖ సంతోషాలు వెల్లివిరియాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆకాంక్షించారు. జిల్లాలో పని చేస్తున్న పోలీస్ అధికారులకు, సిబ్బందికి జిల్లా ప్రజలందరికీ శనివారం ఆయన ఒక ప్రకటనలో సంక్రాంతి శుభాకాంక్షలు తెలిపారు. సంక్రాంతి పండుగ అందరి జీవితాల్లో నూతన క్రాంతులను, సంతోషాలను నింపాలని ఎస్పీ తెలిపారు. భోగి భోగభాగ్యాలను, సంక్రాంతి సుఖ సంతోషాలను, కనుమ కమ్మని కనువిందులను అందించాలని కోరుకు న్నారు. సంక్రాంతి పండుగను సుహృద్భావ వాతావరణంలో, తెలుగు సంస్కృతి సాంప్రదాయాల మేళ వింపుతో కుటుంబసభ్యులు, బంధుమిత్రుల నడుమ జరుపుకోవాలని సూచించారు. రైతులు పాడిపంటలతో ధన ధాన్యాలతో తులతూగాలని ఎస్పీ ఆరిఫ్ హఫీజ్ ఆకాంక్షించారు.

19న విశాఖపట్నం పోర్టు అథారిటీ ట్రేడ్ మీట్

గుంటూరు సిటీ, జనవరి 13: గుంటూరు జిల్లాలోని ఎగుమతి, దిగుమతిదారుల కోసం విశాఖపట్నం పోర్టు అథారిటీ ఆధ్వర్యంలో ఈ నెల 19వ తేదీన ట్రేడ్ మీట్‌ను ఏర్పాటుచేసినట్లు ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ అధ్యక్షుడు భాస్కరరావు శనివారం తెలిపారు. గుంటూరులోని వెల్‌కమ్ హోటల్లో నిర్వహించనున్న ఈ కార్యక్రమాన్ని ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్, ఇండస్ట్రీ భాగస్వామ్యంతో ఏర్పాటుచేసినట్లు తెలిపారు. మిర్చి, పత్తి, పత్తినూలు, పొగాకు, రొయ్యలు, గ్రానైట్, బియ్యం ఎక్కువగా గుంటూరు జిల్లా నుండి ఎగుమతి అవుతున్నందువల్ల ఈ ట్రేడ్‌మీట్ ఇక్కడ ఏర్పాటుచేస్తున్నట్లు భాస్కరరావు అన్నారు. కార్యక్రమంలో పోర్టు అథారిటీ, ఎంపీఈ డీప, ఏపీఈడీప ఉన్నత అధికారులు పాల్గొంటారని తెలిపారు. కార్యక్రమంలో పాల్గొనదలచిన వారు 99120 92222, 72077 51112 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని విజ్ఞప్తి చేశారు.